


# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 17-04-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 188 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### ముస్లిం మహిళలకు

## మసీదుల్లో ప్రవేశం కల్పించాలి

### సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు



దిల్లీ: ముస్లిం మహిళలకు మసీదుల్లో ప్రవేశం కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. ఈ పిటిషన్‌పై తమ స్పందన తెలియజేయాలని కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. అయితే శబరిమల ఆలయం కేసులో తీర్పు ఇచ్చినందువల్లే ఈ పిటిషన్ను విచారణకు స్వీకరించినట్లు జస్టిస్ ఎస్ఏ బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.

ముస్లిం మహిళలు మసీదుల్లో ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ పుణెకు చెందిన ఓ దంపతులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కులం, మతం, తరువాయి 2లో..

## ఈసీపై దుష్ప్రచారం చేస్తున్నారు

### ఆ ఈవీఎంలు పోలింగ్ కోసం వాడలేదు

### రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి రజత్‌కుమార్



హైదరాబాద్: ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగేలా కొందరు సామాజిక మాధ్యమాల్లో ఈసీపై దుష్ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి రజత్‌కుమార్ మండిపడ్డారు. పోలింగ్ శాతాలతో పాటు పలుచోట్ల తరువాయి 2లో..

# శాంతిభద్రతలు దిగజార్చారు



- నిర్వీర్యమైన పోలీసు వ్యవస్థ
- మాపై దాడి చేసి మాపైనే కేసులా!?
- దొంగకేసులు పెట్టి వేధిస్తున్నారు
- ఈవీఎంలపై నెపం తగదు
- గవర్నర్‌ను కలిసిన జగన్, వైకాపా నేతలు

హైదరాబాద్ : రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారిపోయాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గరుండి మరీ పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. తమ పార్టీ కార్యకర్తలపై దాడిచేయడమే కాకుండా దొంగకేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. స్పీకర్ కోడెల శివప్రసాద్ పోలింగ్ బూత్‌లోకి వెళ్లి తలుపు వేసుకున్నా పోలీసులు ఆయనపై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు.

ఓడిపోతాననే భయంతో చంద్రబాబు నాయుడు ప్రజల తీర్పును అవహేళన చేస్తు మాట్లాడుతున్నారని ఆరోపించారు. మంగళవారం ఆయన, వైఎస్సార్‌సీపీ నేతలు పెద్దిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, ఆదిములపు సురేష్, గోవర్ధన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, మెదుగుల వేణుగోపాల్ రెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, శ్రీకాంత్‌రెడ్డి, అవంతి శ్రీనివాస్, ధర్మాన ప్రసాదరావు, పార్థసారథి, ఎస్వీ మోహన్ రెడ్డిలతో కలిసి రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌ను హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో కలిశారు. రాష్ట్రంలో నెలకొన్న శాంతి భద్రతల పరిస్థితిపై గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌కు వైఎస్ జగన్ ఫిర్యాదు చేశారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల రోజు, ఆ తరువాత రాష్ట్రంలో జరిగిన దాడులను గవర్నర్ దృష్టికి తెచ్చామని చెప్పారు. 'గవర్నర్ గారిని కలవడం జరిగింది. నిన్న మా పార్టీ బృందం డిల్లీలో ఎన్నికల సంఘాన్ని కలిసి శాంతిభద్రల మీద ఫిర్యాదు చేసింది. మళ్లీ అవే అంశాల మీద గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. రాష్ట్రంలో ఏ విధంగా దాడులు జరిగాయి. ఏరకంగా తనకు సంబంధిన వ్యక్తులను పోలీసులు డిపార్టుమెంట్‌లో తరువాయి 2లో..

## రెండో విడత ఎన్నికల ప్రచారం ముగిసింది

న్యూఢిల్లీ: రెండో విడత ఎన్నికలకు ప్రచారం ముగిసింది. రెండో విడతలో 12 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని 97 నియోజకవర్గాల్లో ఈనెల 18న పోలింగ్ జరగనుంది.

తమిళనాడులో 39 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరగనున్నాయి. పుదుచ్చేరి-1, కర్ణాటకలో-14, మహారాష్ట్ర-10, యూపీ-8, అసోం, బిహార్, ఒడిశాలో ఐదేసి చోట్ల ఎన్నికలు జరగనున్నాయి.

చత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్‌లో తలా మూడు చోట్ల, జమ్మూకశ్మీర్‌లో రెండు చోట్ల ఎన్నికలు జరగబోతున్నాయి.

మణిపూర్, త్రిపురలో తలా ఒక చోట, తమిళనాడులో 18 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఒడిశా అసెంబ్లీకి రెండో దశలో 35 చోట్ల పోలింగ్ జరగనుంది.

ఇదిలా ఉంటే.. దేవెగౌడ, నవీన్ పట్నాయక్, హేమమాలిని, సుమలత, ప్రకాశ్‌రాజ్ భవితవ్యం తేలనున్నది.

## 'పరిషత్ పోరు'పై జోక్యం చేసుకోలేం

హైదరాబాద్: తెలంగాణలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వొద్దంటూ ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టంచేసింది. బీసీ రిజర్వేషన్ల అంశంలో అన్యాయం జరిగిందంటూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిటిషన్ దాఖలుచేసిన విషయం తెలిసిందే. బీసీలకు రిజర్వేషన్లలో అన్యాయం జరిగిందని.. బీసీ జనాభాను లెక్కించిన తర్వాత దాని ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు తరువాయి 2లో..






## 'ఈసీని బొమ్మలా ఆడిస్తున్నారు'

### 50 శాతం వీవీప్యాట్ స్లిప్పులను లెక్కించాల్సిందే

### ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

### ప్రధాని మోదీపై బాబు ధ్వజం



చెన్నై: జల్లికట్టును నిషేధించి తమిళ సంస్కృతిని ప్రధాని మోదీ అవమానించారని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు విమర్శించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో అన్నాడీ తరువాయి 2లో..

## నీటి ఎద్దడి ఎక్కడా రాకుడదు

### అన్ని రిజర్వాయర్లలో నీటినిల్వలను పెంచాలి

### పూడికలు, పైపుల లీకేజిలను గుర్తించాలి

### రిజర్వాయర్ల ఆక్రమణలను తొలగించాలి

### జిల్లా కలక్టర్ కె.భాస్కర్



విశాఖపట్నం: వేసవిని దృష్టిలో పెట్టుకొని ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిందిగా జిల్లా కలక్టర్ కె.భాస్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలక్టర్ చాంబర్‌లో తాగునీటికి సంబందించి సమ్మర్ ఎక్షన్ ప్లాన్ పై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ అన్ని రిజర్వాయర్లు, కాలువలలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున కాలువలలో పూడిక తీత, పైపుల లీకేజిలను గుర్తించి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలన్నారు. రిజర్వాయర్లలో గల నీటి పారుదలను పెంచే విధంగా చూడాలన్నారు. డ్వామా పీడి, డిఎఫ్ ఒ ఫారెస్టు, జివియంసి కమిషనర్, యస్ ఇ ఇరిగేషన్ అధికారుల బృందం రైవాడ,ఏలేరు రిజర్వాయర్లకు సంబందించిన నీటి తరువాయి 2లో..

### ఎన్డీ తివారీ కుమారుడు

## రోహిత్ ఆకస్మిక మృతి



దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఏపీ మాజీ గవర్నర్ దివంగత ఎన్డీ తివారీ కుమారుడు రోహిత్ శేఖర్ ఆకస్మికంగా మృతిచెందారు. దిల్లీలోని సాకేత్ మ్యాక్స్ ఆస్పత్రిలో రోహిత్ శేఖర్ మృతదేహం లభ్యమైంది. అయితే, ఆయన మృతికి గల కారణాలపై దిల్లీ పోలీసులు ఆరా తీస్తున్నారు. దిల్లీ దక్షిణ డీసీపీ విజయ్‌కుమార్ రోహిత్ శేఖర్ ఆకస్మిక మృతి ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.



# చందన మహోత్సవ మహాసమాహారం





విజయనగరం: ఒకవైపు డప్పుల నాదాలు, వేరొక వైపు గుర్రాల నృత్యాలు వాటికి తగ్గట్టు కోయడాన్సులు, వెంటనే కోలాటం, ఏడారి నుంచి వచ్చాయో తెలీదుకానీ, ఒంటెలు కూడా ఆ సంబరంలో తగునమ్మా అంటూ విన్యాసాలు చేశాయి. నాగపూర్ బేండ్ మేళాకు కాళ్ళగజ్జెలతో తాళం వేసాయి. పులివేసాలు టాసాల డప్పులతో చెవులు మారుమ్రోగించాయి. ఫకీర్ మేళాలు కంజీరీలతో హిదూస్థానీ పాటలు అందుకున్నాయి. ఒకటా రెండా ఎన్నో విచిత్ర వేషధారణలతో సందల్ కదిలింది. ఇది బాబామెట్టలో వేంచేసియున్న హజరత్ ఖాదర్ వలీ బాబా(ర.అ) వారి 60వ గంధమహోత్సవం మంగళవారం బాబాదర్బార్‌లో బాబావారి చిత్రపఠంతో సంబరం పురవీధుల్లోకి బయలుదేరింది. అది శుభకారిణి...అది ఆనంద పదసంచారిణి అంటూ భక్తులు దారిపొడువునా హారతులతో..కొబ్బరికాయలు దిష్టితీసి కొట్టారు. వేలాదిమంది భక్తులు ఆ సందడిలో పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి.. జిల్లాల నుంచి వచ్చి ఒక వేడుకను సామరస్య..విశ్వకళ్యాణవేదికగా ముందుకు నడిపించారు. ఉదయం 10 గంటలకు దర్బార్ నుంచి అబాద్ వీధి (బాబావారి గృహం) నుంచి అంబటిసత్రం, కన్యకాపరమేశ్వరి టెంపుల్, రైల్వేస్టేషన్, బాలాజీ జంక్షన్ మీదుగా దాసన్నపేట, బాబామెట్ట చేరుకునే సరికి సాయత్రం 5 గంటలైంది. పిల్లాపాపలతో ఆ ఊరేగింపు వెంట నడుస్తూ తీవ్రమైన ఎండనికూడా లెక్కచేయలేదు. మద్యాహ్నం నుంచి విరామమెరుగక వేలాదిమందికి అన్నసమారాధన జరుగుతోంది. మంగళవారం రాత్రి కూడా ఈ క్రతువు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.సీతారామరాజు నేతృత్వంలో డాక్టర్ బి.గౌరిశంకర్, డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ వినీత్ కుమార్ సిబ్బంది ఆరోగ్యశిబిరం నిర్వహించి పలువురికి ప్రాధిమిక ఆరోగ్యం పరీక్షలు చేసి వడదెబ్బ తగలకుండా మందులు పంపిణీ చేశారు. పోలీసులు భారీ బందోబస్తి ఏర్పాటుచేసి 24 గంటల సేవలను అందించారు. మున్సిపాలిటీ మంచినీటి సరఫరా చేసింది. దర్బార్, దర్గా దర్శనార్థం ఎల్‌సి కోలగట్ల వీరబధ్రస్వామి, బొత్స అప్పలనరసయ్య, శంబంగి చినప్పలనాయుడు,వివిధ జిల్లా అధికారులు విచ్చేశారు.ఈ సందర్భంగా బాబావారి ప్రియశిష్యులు సూఫీ మహాత్మ అతావుల్లా షరీఫ్‌షా ఖాదరీ బాబా భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ "తల్లిదండ్రులను, వృద్ధులను, పిల్లలను ప్రేమతో చూడటమే నిజమైన భక్తి అని ఉద్భోదించారు. కస్తూరి సువాసనకు ప్రచారం అక్కర్లేదని, అలాగే భగవంతుడు అన్ని జీవుల్లో ఉన్నాడని, సాటివారిని ప్రేమతో చూడటమే ఆధ్యాత్మికతకు అర్ధమని తెలిపారు. ఎవరైతే నిరంతరం బాధాతప్తుల హృదయాలకు ఊరట కల్గిస్తారో...సాటి వ్యక్తి మనసును గాయపర్చకుండా జీవనం సాగిస్తారో వారే దైవానికి నిజమైన భక్తులన్నారు". ఈ కార్యక్రమంలో కలియర్ షరీఫ్(ఉత్తరాకాండ) పీఠాధిపతి ఆలీ, బాబావారి తనయులు ముహ్మద్ ఖ్వాజామొహియుద్ధీన్, ఎం.డి.జాఫర్ షరీఫ్, డాక్టర్ ఖలీలుల్లా షరీఫ్‌తో పాటు బాబావారి శిష్యులు, భక్తులు పాల్గొన్నారు.



విజయనగరం పట్టణంలో శ్రీశ్రీశ్రీ పైడితల్లమ్మవారి ఆలయాన్ని మంగళవారం కలెక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ దర్శించుకున్నారు. ఆలయ ఇఓ ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలకగా వేదపండితులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. అమ్మవారి పూర్ణాహుతి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.

## మహిళలతో మంత్రి మల్లాడి సమావేశం

యానాం : పుదుచ్చేరి పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి వి.వైద్యలింగంకు ఓటు వేసి గెలిపించాలని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు కోరారు. మంగళవారం ఎర్రగార్డెన్స్‌లో ఆయన స్వగృహంలో వివిధ గ్రామాలకు చెందిన మహిళలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. యానాంలో అమలు చేస్తున్న పథకాలను మహిళల పేరున అమలు చేస్తున్నామని, చేతి వృత్తు లలో శిక్షణ పొందేలా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.

పవర్ పనులు పూర్తయితే అక్కడ మహిళలకు ఉచితంగా షాపులు ఇచ్చి కరెంటు కూడా ఉచితంగా ఇస్తామన్నారు. మహిళల ఉపాధి కోసం రానున్న రోజులలో చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు.

చేసిన పనులకు కృతజ్ఞతగా కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ భారీ మోటారు వాహన ర్యాలీ



యానాం : పుదుచ్చేరి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మోటారు వాహన ర్యాలీ నిర్వహించారు. మంగళవారం ఎర్రగార్డెన్స్‌లో పుదుచ్చేరి ఆరోగ్యశాఖమంత్రి మల్లాడి కృష్ణారావు స్వగృహం వద్ద నుండి సుమారు 3వేలు మోటార్ వాహనాలపై భారీ ర్యాలీ ప్రారంభమైంది. ఎర్రగార్డెన్స్ నుండి సుబ్రహ్మణ్య వారి వీధి మీదుగా పిల్లారామ్ వీధిలో పిల్లారాయుని దేవా లయంలో మంత్రి మల్లాడి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుండి పడవల రేవు వీధి, త్యాగరాజవీధి, వైఎస్ఆర్ కాలనీ, దొమ్మేటి వారిపేట, సీతారామ్‌నగర్, దరియాల తిప్ప, గిరియంపేట, సావిత్రినగర్, పాత బస్టాండ్‌కు చేరుకుని డా.బి.ఆర్.అంబ్కేర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌కు ఓటు వేయాలంటూ మల్లాడి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ భారీ ఎత్తున నినాదాలు దారిపొడవునా మిన్నంటాయి. ఈ ర్యాలీలో గ్రామాలలో ప్రజలు పూలమాలలు హారతులు, తిలకం దిద్దుతూ స్వాగతం పలికారు. పుదుచ్చేరి పార్లమెంటు ఎన్నికలలో ఈనెల 18న జరగనున్న పోలింగ్‌లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వి.వైద్య లింగంకు యానాం ఓటర్లు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌పార్టీ విజయంలో యానాం ఓటర్ల మెజార్టీ అధికంగా వుండేలా చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి పేదవాడికి ప్రజా సంక్షేమ పథకాలు అందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో రావాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే తన ధ్యేయమన్నారు. ప్రజలు చూపిస్తున్న ఆదరాభి మానాలకు ఎప్పుడూ రుణపడి వుంటామన్నారు. ఈ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.


## తుఫాను సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు



విశాఖపట్నం : ఎన్‌డిఎమ్‌ల మరియు ఎస్‌డిఎమ్‌లు ఉత్తర్వుల మేరకు 10వ బెటాలియన్ ఎన్‌డిఆర్‌ఎఫ్ కమాండెంట్ జౌహిద్‌ఖాన్ ఆదేశాల మేరకు రీజనల్ రెస్పాన్స్ సెంటర్ విశాఖపట్నం నుండి టీమ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో 30మంది సభ్యులు గల టీమ్ గ్రామం చేపలుప్పాడ, మండం, కలెక్టర్ సమన్వయంతో కేంద్ర మరియు రాష్ట్ర విపత్తు నిర్వహణ జరిగింది. ఈ సందర్భంగా టీమ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ తుఫాను అంటే ఏమిటి, మరియు దాని ప్రభావం, తుఫానుకు ముందు సమాయత్తం, తుఫాను సమయంలో మరియు తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలు దీని ద్వారా ప్రజలు తమ ప్రాణ, ఆస్తినష్టాన్ని ఎలా తగ్గించుకోవచ్చు, తుఫాను సమయంలో అన్ని ప్రభుత్వ శాఖలు తమ తమ విధులు, చర్యలు గురించి వివరించి, తీరప్రాంతంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ సభ్యులు మాక్‌డ్రిల్ నిర్వహించి మునిగిపోతున్న వ్యక్తులను వాటర్ రిసోర్స్ టెక్‌మాప్ ద్వారా బయటకు చేర్చి వారికి ప్రధమ చికిత్స అందించి, భారీ వృక్షాల కింద చిక్కుకుపోయిన వ్యక్తులను తమ పరికరాలు, ఉపకరణాల ద్వారా రక్షించే తీరు కళ్లకు కట్టినట్లు చూపించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆయా శాఖల అధికార ప్రతినిధులు హాజరయ్యారు.

# అటవీ ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ వినియోగించండి

విశాఖపట్నం : అటవీ ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ వినియోగించడం వల్ల అటవీసంపదపై ఆధారపడ్డ గిరిజనులకు మనం ప్రోత్సహించిన వారౌతామని గిరిజన సహకార సంస్థ ఎండీ బాబూరావు నాయుడు అన్నారు. అటవీ ఉత్పత్తుల కనీస ధరపై రాష్ట్ర స్థాయి న్యాయ సలహా సదస్సును మంగళవారం ప్రముఖ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిపుత్రులు పండించే అటవీ ఉత్పత్తుల ఫలాల విలువలను ఎలా పెంచాలనే దానిపై ఈ రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పండించే అటవీ ఉత్పత్తులను మార్కెట్ రేటు పెంచుకుంటే ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతారన్నారు. మన రాష్ట్రంలో అనేక అటవీ ఉత్పత్తులు ఉన్నప్పటికీ కనీస మద్దతు ధర ఐదు ఉత్పత్తులకు మాత్రమే అందుతుందని మిగిలిన 18 రకాల ఉత్పత్తులకు మద్దతు ధర ఇచ్చేందుకు ప్రభుత్వం కృతనిచ్చయంతో ఉందన్నారు. అనంతరం పద్మశ్రీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎటువంటి రసాయనాలు వాడకుండా పండించే గిరిజన ఉత్పత్తులు వినియోగించడం ఆరోగ్యానికి మంచిదన్నారు. అయితే గిరిజన ఉత్పత్తుల ఉపయోగాలను ప్రజలక వివరించి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రతి వక్కరిపై ఉందన్నారు. ప్రస్తుతం గిరిజనులు పండించే చిరు ధాన్యాలకు మంచి గిరాకి ఉన్న ప్పటికీ ఆయా ఉత్పత్తులు మన రాష్ట్రంలో లేకపోవడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవడం జరుగుతుంద న్నారు. గిరిజన ఉత్పత్తులు పండించే వారికి ఇటువంటి సదస్సులు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందస్సులో పీఓ లక్ష్మీ షా, సీతంపేట పీఓ శివశంకర్, సి.సెల్వం, వై.వెంకటేశ్వరరావు, ప్రమోద్ మెర్‌కాప్, బి.జగదీష్, అశోక్‌కుమార్, దేవరాజ్ తో పాటు గిరిజన సహకార సంస్థ ఉద్యోగులు గిరిజన రైతులు పాల్గొన్నారు.




మొదటి పేజీ తరువాయి

## శాంతిభద్రతలు దిగజార్చారు

పెట్టుకొని చంద్రబాబు దాడులు చేయిస్తున్నారో గవర్నర్‌కు వివరించాం' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

ఎందుకు కేసు పెట్టలేదు?

సత్తెనపల్లి నియజకవర్గం ఇనిమెట్ల గ్రామంలో స్పీకర్ కోడెల శివప్రసాద్ పోలింగ్ బూత్‌లోకి వెళ్లి డోర్‌ను లాక్ చేసుకున్నారు. ఇది రికార్డులో ఉంది. ఓ పార్టీ అభ్యర్థి అలా చేయడం కరెక్టేనా? అక్కడ పోలింగ్ అధికారులు లేరా? డోర్ వేసుకొని తనంతట తాను చొక్కాలు చించుకొని రాద్ధాంతం చేయడం కరెక్టేనా? ఆయన మీద ఎందుకు కేసు పెట్టలేదు. గురజాలలో ఎస్సీ, ముస్లింలు ఓటేయలేదని కొట్టారు.. అయినా ఎందుకు కేసు పెట్టలేదు. ఎమ్మెల్యే శ్రీవాణిని ఏకంగా రూమ్‌లో బంధించి, టీడీపీ కార్యకర్తలు దాడి చేసినా ఎందుకు వారిపై కేసు పెట్టలేదు. పూతలపట్టులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంఎస్ బాబును పోలింగ్ రోజు టీడీపీ నేతలు కొడితే కుట్లు పడ్డాయి. ఇప్పటికీ ఆస్పత్రిలోనే ఉన్నాడు. ఎందుకు కేసు పెట్టలేదు? చంద్రబాబు యధేచ్ఛగా తన కులానికి చెందిన 40 మందికి డీఎస్పీలుగా ప్రమోషన్లు ఇచ్చారు. వారు టీడీపీ తొత్తులుగా మారి ఇష్టం వచ్చినట్లు పనిచేస్తున్నారు. అన్యాయంగా కొడుతూ బాధితులపైనే కేసులు పెడుతున్నారు. అందరూ కలిసి శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారు.

అప్పుడు ఈవీఎంల మీద అనుమానం రాలేదా?

రాష్ట్రంలో ఈవీఎంల ద్వారా దాదాపు 80 శాతం పోలింగ్ జరిగింది. 80 శాతం జనాభా వెళ్లి పోలింగ్ బూత్‌కి వెళ్లి ఓటు వేశారు. వాళ్లు ఎవరికి ఓటు వేశారో వీవీ ప్యాట్‌లో చూసుకొని సంత తృప్తిగా బయటకు వచ్చారు. ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదు. నేను ఫ్యాన్ కి వేసినా.. సైకిల్కి పడితే ఊరుకొను కదా? అలా అయితే ప్రజలు ఎందుకు ఊరుకుంటారు? ఇవన్నీ చంద్రబాబుకు తెలుసు. ఆయన సినిమాలో విలన్ లాగా డ్రామాలు చేస్తున్నారు. పోలింగ్ మొదలయ్యే ముందు ప్రతి బూత్‌లోనూ అన్ని పార్టీల ఏజెంట్లు అక్కడ కూర్చుంటూరు. మాక్‌పోలింగ్ చేస్తారు. వాళ్లు నొక్కిన గుర్తు పడితేనే పోలింగ్ ఏజెంట్లు సంతకాలు పెడతారు. ఈవీఎంలు పనిచేస్తున్నాయని సంతకాలు తీసుకున్న తర్వాతనే ఓటింగ్ జరుగుతుంది. టీడీపీ పోలింగ్ ఏజెంట్లు ఒప్పుకున్న తర్వాతే పోలింగ్ మొదలయ్యాయి. ఇప్పుడు చంద్రబాబు నేను ఎవరికి ఓటు వేశానో.. నాకే తెలవది అంటున్నారు. ఇది సీఎంస్థాయి వ్యక్తి చేసే పనియేనా? ఇదే పెద్దమనిషి చంద్రబాబు 2014లో గెలిచింది ఈవీఎంలతోనే కాదా? అప్పుడు ఏ పార్టీకి ఓటు వేశారో కూడా తెలియదు. వీవీప్యాట్‌లు లేవు. అప్పుడు మేం ఏం అనలేదు. నంధ్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే అన్ని బాగున్నాయి కానీ ఇప్పుడు ఈవీఎంలు పనిచేయడం లేదు అంటారు. ఇదే ఈవీఎంలతో మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, కర్నాటకలో కాంగ్రెస్ గెలిచింది. బీజేపీ ఓడిపోయింది. అప్పుడు ఎందుకు చంద్రబాబు మాట్లాడలేదు. ఒక సీఎం స్థాయి వ్యక్తి ప్రజల తీర్పు అవహేళన చేస్తు మాట్లాడడం సిగ్గు చేటు. చంద్రబాబు బుద్ధి ఇదే. గెలిస్తే సింధుకు నేనే ఆమెకు బాడ్మింటన్ నేర్పించా అంటారు. బిల్‌గేట్స్‌కు నేనే కంప్యూటర్ నెర్పించా అంటారు. ఓడితే సింధు కోచ్‌ది తప్పు, బిల్ గేట్స్ కంప్యూటర్ బటన్ సరిగా నొక్కలేదని అంటారు. చంద్రబాబు పాలనపై ప్రజలకు విసుగెత్తి బైబై బాబు అన్నారు.తన మోసపూరిత పాలన బయటపడొద్దని ఈవీఎంల మీద నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారు' అని జగన్ ఆరోపించారు.

## ముస్లిం మహిళలకు మసీదుల్లో ప్రవేశం కల్పించాలి

వర్గం, ప్రాంతం, లింగం ఆధారంగా ఏ పౌరుడిపైనా వివక్ష చూపించడం సరికాదని పిటిషనర్లు పేర్కొన్నారు. మసీదుల్లోకి ముస్లిం మహిళలు రాకుండా ఆంక్షలు విధించడం రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై నేడు విచారణ జరిపిన న్యాయస్థానం.. మసీదుల్లోకి ముస్లింలను ఏ దేశంలోనైనా అనుమతిస్తున్నారా అని పిటిషనర్ల తరపు న్యాయవాదులను అడిగింది. ఇందుకు వారు స్పందిస్తూ.. కెనడా, మక్కాల్లో అనుమతిస్తున్నారని తెలిపారు. వాదనలు విన్న అనంతరం పిటిషన్‌పై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. 'ఈ పిటిషన్‌ను స్వీకరించడానికి ఒకే ఒక్క కారణం.. శబరిమల వివాదంలో మేం తీర్పు ఇచ్చినందు వల్లే' అని ధర్మాసనం ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

## ఈసీపై దుష్ప్రచారం చేస్తున్నారు

ఈవీఎంల తరలింపు తదితర అంశాలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పూర్తి పారదర్శకంగా పనిచేస్తున్నట్టు స్పష్టంచేశారు. పోలింగ్ పూర్తయిన వెంటనే సాయంత్రం 5గంటలకు అంచనా వివరాలు ఇస్తామని.. తర్వాతి రోజు మాత్రమే పోలింగ్ శాతాలపై స్పష్టమైన సమాచారం ఇవ్వగలమని పేర్కొన్నారు. పోలింగ్ ముగిసే ముందు ఫారం 17సీ కాపీలు పోలింగ్ ఏజెంట్లకు అందిస్తామని.. దానిపై వాళ్ల సంతకాలు సైతం ఉంటాయన్నారు. ఫారం 17ఏ, ఫారం 17సీని సరిచూసుకున్న తర్వాత కూడా అనవసర రాద్ధాంతం చేయడం తగదని మండిపడ్డారు. జగిత్యాలలో ఆటోలో రవాణా చేసిన ఈవీఎంలను పోలింగ్ కోసం వాడలేదని.. అవి అవగాహణ కోసం వాడిన యంత్రాలు మాత్రమేనని రజత్‌కుమార్ స్పష్టంచేశారు. తప్పుడు ప్రచారం చేసినవారిపై కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పార్టీల ప్రతినిధులు కూడా ఉండొచ్చన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, అవాస్తవాలు ప్రచారం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. కల్పిత కథనాల వల్ల ప్రతిఒక్కరికీ అనుమానాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కీసరలో ఈవీఎంలను సీల్ చేసేటప్పుడు చరవాణిలో ఫొటో తీసుకున్న వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. ప్రజలను ఆందోళనకు గురిచేసేలా కథనాలు ఇవ్వొద్దన్నారు.

## 'ఈసీని బొమ్మలా ఆడిస్తున్నారు'

ఎంకేకు ఓటేస్తే మోదీకి వేసినట్లేనని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారం కోసం తమిళనాడులో పర్యటిస్తున్న ఆయన చెన్నైలో డీఎంకే సీనియర్ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. 50 శాతం వీవీప్యాట్ స్లిప్పులను లెక్కించాల్సిందేనని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ విషయంపై మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్తామని ఆయన స్పష్టం చేశారు. కరుణానిధి వారసుడు, డీఎంకే అధినేత స్టాలిన్‌ను సీఎంగా చూడాలనేది తమిళ ప్రజల ఆకాంక్ష అని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేసిన మోదీ.. దేశాన్ని అంధకారంలోకి నెట్టారని చంద్రబాబు ధ్వజమెత్తారు. ఎన్నికల సంఘాన్ని చెప్పుచేతల్లో పెట్టుకుని ఆడిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఏపీలో ప్రజాతీర్పును అపహాస్యం చేసేలా ఈసీ వ్యవహరించిందని మండిపడ్డారు. ఈవీఎంలు మొరాయించడం కుట్రలో భాగమేనని చంద్రబాబు ఆరోపించారు. ఈవీఎంలపై ప్రజలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఈసీకి ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని.. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

## 'పరిషత్ పోరు'పై జోక్యం చేసుకోలేం

చేయాలని ఆయన కోరారు. పిటిషన్‌పై విచారణ పూర్తయ్యేలోపు ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉన్నందున ఆ నోటిఫికేషన్ జారీచేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని న్యాయస్థానాన్ని ఆయన అభ్యర్థించారు. అయితే, పిటిషనర్ అభ్యర్థనను ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టంచేసింది. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కొనసాగించాల్సిందేనని పేర్కొంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన వివాదాలపై పూర్తిస్థాయి వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ అంశంపై మూడు వారాల్లోగా వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను వచ్చే నెల 22కు వాయిదా వేసింది. దీంతో రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నిలకు మార్గం సుగమమైంది.

## నీటి ఎద్దడి ఎక్కడా రాకుడదు

నిల్వలపై పట్టణ ప్రాంతాలకు సరఫరాపై సమీక్షించి ఒక ఏక్షన్ ప్లాన్ తయారు చేసి పూర్తి వివరాలను అందజేయాలన్నారు. మూడు, నాలుగు పెట్రోలింగ్ పార్టీలను ఏర్పాటుచేసి ప్రతి రోజు కాలువల తనిఖీలను చేపట్టాలన్నారు. రిజర్వాయర్ల చుట్టుపక్కల ఉన్న స్థలాలను అక్రమించడం, వ్యవసాయం, భవన నిర్మాణాలను చేపట్టి అక్రమణకు పాల్పడుతున్న వారిని గుర్తించి సంబందిత వ్యక్తులపై చర్యలు తీసుకోవడంతోపాటు ఆక్రమణలను వెంటనే తొలగించాలన్నారు. ఏలేరు, గోదావరి, రైవాడ రిజర్వాయర్లలో ప్రస్తుతం నిల్వఉన్న నీటి వివరాలను తెలియ జేయాలన్నారు. అన్ని నదులు, రిజర్వార్లలో నీటి నిల్వలు పెరగాలని పై నుండి వస్తున్న ప్రవాహం మద్యలో నీటిని దొంగిలించకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని, సంబంధిత వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టాలన్నారు. మేఘాద్రి గెడ్డ, తాటిపూడి, ముడసర్లోవ, రైవాడ, గంభీరంగెడ్డ ,గోస్తనీ లకు సంబందించిన రిజర్వాయర్లకు నరేగానిధులనుండి వాటర్ షెడ్ల ట్రీట్ మెంటుద్వారా నీటిని నిల్వచేసి భూగర్భజలాలు పెరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ పనులన్నింటిని వేగవంతం చేసి ఈ వారం లోపల మొదలు పెట్టాలన్నారు. అన్ని రిజర్వాయర్లనుండి పంపింగ్ చేసి త్రాగునీటిని అందరికీ అందే విధంగా చూడాలన్నారు. పట్టణ ప్రాంతంలో నీటిని సరఫరా చేస్తున్న అన్ని బ్యాంకులకు జీపీఎస్ సిస్టమ్ను అమర్చాలని, వేసవిలో అదనంగా సరఫరా చేస్తున్న నీటి ట్యాంకులకు కూడా జిపిఎసను అమర్చాలన్నారు. వీటన్నిటికి సంబందించి రిపోర్టును వెంటనే అందజేయాలన్నారు. మరమ్మతులకు గురైన చేతిపంపులకు సంబందించి వాటిని వెంటనే బాగుచేయడంతోపాటు అవసరమైన ప్రాంతాలలో కొత్తబోర్లను వేసి ప్రతి పదిరోజులకొక సారి వాటి పనితీరును పరిశీలించాలన్నారు. అదేవిధంగా ఆయా బోర్లలో వస్తున్న నీటి సాంద్రత, నాణ్యత తదితర పదకొండు రకాల టెస్టులను చేపట్టి రిపోర్టును అందజేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో చెరువుల పూడిక తీత, నీటిట్యాంకులను శుబ్రపరిచి క్లోరినేషన్ చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. బోర్లను మంచి నీటి పైపులను మరమ్మత్తులు చేపట్టి వాడకంలోకి వచ్చే విధంగా వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. అవసరం మేరకు అదనంగా వర్కర్లను పెట్టి మరమ్మత్తులను వేగవంతం చేయాలన్నారు. అన్ని స్కీమ్‌లకు సంబంధించి వాటర్ వర్క్సను పూర్తి చేయాలన్నారు.

## ప్రజల్లో చైతన్యంతో బాల్య వివాహాలను అరికట్టవచ్చు



డాబాగార్డెన్స్: ప్రస్తుతం అన్ని మతాల్లోనూ బాల్యవివాహాలు జరుగుతున్నాయని ప్రజల్లో చైతన్యం తోటే ఈ సమస్యకు పరిష్కారం చూపగలమని మాజీ సీడబ్ల్యూసీ మెంబర్ అబ్దుల్ రకీబ్ పేర్కొన్నారు. మంగళవారం హెూటల్ బుదిల్ పార్క్ లో గ్రామ స్వరాజ్య సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్య వివాహాలు ,మహిళల అక్రమ రవాణా, బాలికల విద్య తదితర అంశాలపై సదస్సులో అబ్దుల్ రకీబ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఈ సమస్యలను తీర్చడానికి ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ప్రజల్లో చైతన్యం కొంతమేరకు కొరవడడం కారణంగానే సమస్యలు పునరావ ృతం అవుతున్నాయన్నారు. చట్టాలపై అందరూ అవగాహన కల్పించుకోవాలి అన్నారు. ముస్లిం మత పెద్దలు కు ఈ సందర్భంగా చట్టాలను వివరించారు గ్రామ స్వరాజ్య సమితి గ్రామ స్వరాజ్య సమితి గ్రామ స్వరాజ్య సమితి ప్రతినిది డి. నాయుడు మాట్లాడుతూ తమ సంస్థ తరపున అనేక సామాజిక అంశాలలో సెమినార్లు, అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలకు చైతన్య పరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు అహ్మదుల్లా, వక్ఫ్ బోర్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## పని చేయని రక్షిత పథకం

రావికమతం: మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తకోటలో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. గ్రామంలోని 16 వార్డుల్లో సగానికి పైగా వార్డులకు తాగునీరు అందించే మెయిన్ ట్యాంకు మోటారు మరమ్మత్తులకు గురవడంతో రెండు రోజులుగా పని చేయడం లేదు. దీంతో వీధి కొళాయిలకు నీటి సరఫరా నిలిచిపోయింది. సుమారు 15వేలకు పైగా జనాభా ఉన్న ఈ గ్రామంలో వేసవిలో తాగునీటి ఎద్దడి నెలకొంటోంది. రోజు విడిచి రోజు వీధి కొళాయిల ద్వారా పంచాయతీ వారు తాగునీటిని సరఫరా చేస్తున్న సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రధాన ట్యాంకు మోటారు పాడై రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఒకటి నుంచి ఏడు వార్డుల్లోని వారు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. కొందరు మహిళలు పొలాల్లోని వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి బిందెలతో నీళ్లను ఆటోలపై తెచ్చుకుంటున్నారు. వేసవి వచ్చిందంటే చాలు తాగునీటికి నరకాన్ని చూడాల్సి వస్తుందని, పంచాయతీ అధికారుల పట్టించుకోవడం లేదని మహిళలు వాపోతున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేయించి తాగునీటిని కుళాయిల ద్వారా సరఫరా చేయిస్తామని తెలిపారు.

## యువతకు కంప్యూటర్ పరిజ్ఞానం కల్పనే లక్ష్యం

కొయ్యూరు: గిరిజన, పేద, నిరుద్యోగ యువతి, యువతకు విద్యార్థుల అభివృద్ధి లక్ష్యంగా చేసుకొని నేటి ఆధునిక శాంకేతిక పరిజ్ఞానం దృష్టిలో పెట్టుకొని, వారికి కంప్యూటర్ విజ్ఞానం అందించాలనే లక్ష్యంతో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు రాజేంద్రపాలెం రబ్బి కంప్యూటర్ ఎడ్యుకేషన్ నిర్వాహకుడు మఠం కేశవరావుపడాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో కొందరికైన వారి లక్ష్యపు వైపు నడిపించాలనే ధ్యేయంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అందుకోసం కంప్యూటర్ విజ్ఞానంతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్, మోటివేషనల్ తరగతులు అందించాలనే తపనతో స్వతహాగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. 45 రోజులు సమ్మర్ ఉచిత కంప్యూటర్ శిక్షణ, అడ్మిషన్లు ప్రారంభం, వివరాలకు నిర్వాహకుడు కేశవరావుపడాల్ మఠం, సెంటర్ ఇన్‌చార్జ్ మల్లేశ్వరరావు జర్సింగి 9491659778, 7382380698 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

## వసతి గృహానికి మరమ్మతు చేయాలి

నాతవరం: మండల కేంద్రంలోని వసతి గృహాల్లో పలు సమస్యలు రాజ్యమేలుతున్నాయి. స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం గేటు ఊడిపడి దర్శనమిస్తోంది. కిటికీలకు తలుపులు లేకపోవడంతో వర్షంలోనికి వచ్చేస్తోంది.

కొన్ని గదుల్లో శ్లాబ్ పెచ్చులూడి పడుతుండటంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. వీటిని తక్షణం మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

## ఈనెల 30న శ్రీశ్రీ ప్రతిభా పురస్కారాల ప్రదానం

డాబాగార్డెన్స్: గత 20 సంవత్సరాలుగా ఎన్నో సాహిత్య, సేవా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎందరో ప్రతిభావంతులను ప్రోత్సహిస్తున్న శ్రీ శ్రీ కళావేదిక- వేదిక సిసి టీవీ సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రియల్ 30 వ తేదీ శ్రీ శ్రీ గారి జయంతిని పురస్కరించుకుని రాజమహేంద్రవరం వివిధ రంగాల్లో ప్రతిభ కనపరిచిన వారికి శ్రీ శ్రీ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు వేదిక సిసిటివి కన్వీనర్ డాక్టర్. నరేంద్ర ఆరవల్లి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.కవులకు ,రచయితలకు, కళాకారులకు, సామాజిక కార్యకర్తలకు, విద్యా, వైద్య, ఉద్యోగ మరియు ఇతర రంగాల్లో నిష్ణాతులకు ,మరియు వివిధ రంగాల్లో ప్రావీణ్యులకు పురస్కారాలుతో పాటు బిరుదులను శ్రీశ్రీ పేరిట ఇచ్చే ఈ అవార్డులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబరు 97058 31063లో సంప్రదించాలని కోరారు.

## అధ్వాన్నంగా యానాద్రి కాలువ

యలమంచిలి రూరల్: ప్రభుత్వాలు, నాయకులు మారిన యలమంచిలి ప్రజల ప్రధాన సమస్యగా మిగిలిన యానాద్రి కాలువ పరిస్థితి మారలేదు. పదేళ్ల క్రితం యానాద్రి కాలువ అభివృద్ధికి పడిన పునాదిరాయి ఎటువంటి కదలిక లేకుండా యలమంచిలి ప్రజలను వెక్కిరిస్తూనే ఉంది. నానాటికి పెరుగుతున్న యలమంచిలి జనాభాకు తగినట్లుగా మురుగు వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. యలమంచిలి పట్టణంలోని అన్ని వీధుల గుండా ప్రవహించే మురుగునీరు ఈ యానాద్రి కాలువకు అనుసంధానం చేశారు. యానాద్రి కాలువ ఎక్కడికక్కడ అక్రమణలకు గురి కావడంతో కాలువ మొత్తం పూడుకుపోయి మురుగునీరు ప్రవహించే అవకాశం లేకుండా పోతుంది. దీంతో పందులు ఈ కాలువలో పొర్లుతూ మరింత రోత పుట్టిస్తున్నాయి. దోమల వృద్ధి కేంద్రంగా తయారైన యానాద్రి కాలువ ద్వారా దోమలు అధికమవుతున్నాయి. వేలకు వేలు ఇంటి పన్నులు వసూలు చేసే మున్సిపల్ అధికారులు మురుగు వ్యవస్థను మెరుగుపరిచే చర్యలు చేపట్టకపోవడం పట్ల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. దీనికి తోడు ఇటీవల కాలంలో దోమలు అధికం కావడంతో ప్రజలు మరింత విసుగుచెందుతున్నారు. కాలువను అభివృద్ధి పరచాలని ప్రజలు కోరుతున్నారు.

## జ్యోత్న హంతకులను కఠినంగా శిక్షించాలి

### అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం డిమాండ్



విశాఖ సిటీ: విశాఖ నగరం, మల్కాపురం జనతా కోలనీకి చెందిన ఇంజనీరింగ్ విధ్యార్థిని జ్యోత్స్న ను హత్య పై సమగ్రమైన దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నగర కమిటీ డిమాండ్ చేస్తోంది. మంగళవారం జ్యోత్స్న మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించగా మార్చురీ వద్ద మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు, మృతురాలి బంధువులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నగర నాయకులు ఆర్.యన్. మాధవి, ఆర్.విమల, కె.కుమారి, నూర్జహాన్ బేగం, యస్‌యఫ్ఐ నగర కార్యదర్శి యల్.జే. నాయుడు మాట్లాడుతూ జ్యోత్స్న మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని, ఆమెను పథకం ప్రకారం హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించడానికి నిందితులు ప్రయత్నించారని, ఉదయం కాలేజీకి వెళ్ళిన ఆమె సాయంత్రానికి ఆత్మహత్య చేసుకుందని పోలీసులు చెప్పడం, ఉరిత్రాడుకు ఉన్న మృతదేహాన్ని పోలీసులు రాకముందే క్రిందకు దింపడం, వెనుక వైపు తలుపు తెరచి ఉండటం చూస్తే హత్యగా భావించవలసి వస్తున్నదని, ఈ కేసుని హత్యాకోణంలో పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. జ్యోత్స్న కేసులో నిందితులను త్వరితగతిన శిక్షించాలని, వారి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, మహిళలకు రక్షణ కల్పించాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని, మద్యం, అశ్లీల సినిమాలు, సాహిత్యం, అశ్లీల వెబ్‌సైట్‌లు నిషేధించాలని, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేసారు.

## ఆర్బీఐ డిజిఎమ్‌కు గీతం పి.హెచ్.డి అవార్డు



సాగర్‌నగర్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ముంబాయి) డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీకార్తిక్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ ద్వారా దేశంలోని బ్యాంక్ రుణాల ఎగవేత ముందస్తు సూచికలు అనే అంశం పై జరిపిన పరిశోధనలకు గాను పి.హెచ్.డి.అవార్డును ప్రకటించారు. ప్రొఫెసర్ ఎమ్.సుబ్రమణ్యం పరివేక్షణలో లక్ష్మీకార్తిక్ తన పరిశోధన నిర్వహించారు. గడిచిన పదిహేను సంవత్సరాలలో దేశంలోని బ్యాంక్‌ల నుంచి రుణాలు తీసుకుని ఉద్దేశ్యపూర్వకంగా ఎగవేసిన వారి వివరాలను సేకరించి విశ్లేసించారు. ఆర్థిక రంగంలో 9 కీలక అంశాలను అద్యయనం చేస్తు ఆర్థిక సంస్థల నుంచి రుణ ఎగవేతలకు పాల్పడే వారిని ఏ విధంగా గుర్తించ వచ్చో డాక్టర్ లక్ష్మీకార్తిక్ సూచించారు.

## పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసి రీపోలింగ్ నిర్వహించాలి

అరకు వేలి: 28-అరకు వేలీ (ఎస్టీ) అసెంబ్లీ నియోజకవర్గం ముంచంగిపుట్టు మండలంలో వున్న పి.ఎస్.నెం. 30, 31, బుంగాపుట్టు, కోసాంపుట్టు పోలింగ్ బూత్‌లను బాబుసాల పంచాయితీ మత్స్యపురం పోలింగ్ బూత్‌లో విలీనం చేశారు. బుంగాపుట్టు, కోసాంపుట్టు ఓటర్లు మత్స్యపురం రావాలంటే ఒకవైపు సుమారు 60 కిలో మీటర్లు దూరం కొండలు, గెడ్డలు దాటుకుంటూ రావాలి. ఈ విషయంపై ఎన్నికల ముందే అధికారులకు విన్నవిస్తే సానుకూలంగా స్పందించారు. కాని పోలింగ్ కేంద్రను మార్చలేదు. దీంతో ఆ పంచాయితీలో ఉన్న 19 గ్రామాలకు సంబంధించిన 1049 మంది తమ ఓటు హక్కును వినియోగించకుండా బాయ్‌కట్ చేశారు. అక్కడ ఓటర్లు అందరూ పోలింగ్ కేంద్రాన్ని తమ పంచాయితీలో పెట్టాలని, తామంతా ఓట్లు వేస్తామని ఆందోళన కూడా చేసియున్నారు. కావున తమరు వెంటనే ఈ విషయంపై జోక్యం చేసుకొని పి.ఎస్.నెం. 30, 31 బుంగాపుట్టు, కోసాంపుట్టు లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి రిపోలింగ్ నిర్వహించాలని సిపిఎం పార్టీ విజ్ఞప్తి చేస్తోంది.

## సంపద తయారీ కేంద్రం వినియోగంలోకి తీసుకురావాలి

రోలుగుంట: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చి ఎరువులు తయారు చేసి విక్రయించాలని జిల్లా రిసోర్స్ పర్సన్ బి.చిన్నంనాయుడు పంచాయతీ కార్యదర్శి లాలం శివకు సూచించారు. కంచుగుమ్మల, రోలుగుంట, కొమరవోలు గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాల్లో చెత్తతో సంపద తయారీ కేంద్రాల నిర్వహణను పరిశీలించారు. తడిచెత్త, పొడి చెత్త డంపింగ్ విధానం, వాటిని వేరు చేయడంపై మరోసారి అవగాహన కల్పించారు. ప్రభుత్వం రాయితీపై ఇచ్చిన వానపాములతో ఎరువులు తయారు చేసి స్థానిక రైతులకు అందజేయాలని, ఇంకా మిగిలి ఉంటే ఇతర గ్రామాల అవసరం మేరకు ఎరువులు విక్రయాలు చేయాలని సూచించారు. పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గీతం న్యాయ కళాశాల అడ్మిషన్లు ప్రారంభం

సాగర్‌నగర్: న్యాయవాద వృత్తిలో ప్రవేశించాలనే వారికి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత ప్రధాన అర్హతగా గీతం స్కూల్ ఆఫ్ లా ఐదేళ్ల న్యాయ విద్యా కోర్సులలో ప్రవేశాలను కల్పిస్తోంది. ఆర్ట్స్ మరియు కామర్స్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసిన వారికి సహితం న్యాయ విద్యను అభ్యసించేందుకు అవకాశం లభిస్తోంది.

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల స్కూల్ ఆఫ్ లా 2019-20 విద్యా సంవత్సరానికి న్యాయ విద్యా కోర్సులకు అడ్మిషన్లను నిర్వహిస్తోంది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ) అనుమతితో నిర్వహిస్తున్న న్యాయ విద్యా కోర్సులలో ప్రవేశానికి వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు అధికంగా ఆసక్తి కనబరుస్తున్నారు. గీతం స్కూల్ ఆఫ్ లా ద్వారా ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బి.ఎ., ఎల్ఎల్‌బి (ఆనర్స్) కోర్సును, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ తో కలసిన ఎల్ఎల్‌బి ఆనర్స్ కోర్సును, మూడేళ్ల ఎల్ఎల్‌బి కోర్సును, ఏడాది కాలవ్యవధి గల ఎల్ఎల్ఎమ్ (సైబర్ ఫోరెన్సిక్, మేరీటైమ్, సర్వే & రెవెన్యూ లా ) కోర్సును నిర్వహిస్తున్నారు.

కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్-2019) లేదా లా స్కూల్ అడ్మిషన్ టెస్ట్ (ఎల్‌శాట్-2019) లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పై కోర్సులలో నేరుగా ప్రవేశాలు కల్పిస్తామని స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ అనితారావు తెలిపారు.

***గీతం స్కూల్ ఆఫ్ లా ప్రత్యేకతలు:***

న్యాయ విద్యా కోర్సులలో ప్రత్యేక అంశంగా డ్రాఫ్టింగ్, ప్లీడింగ్, కన్వెన్సింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ లా గౌరవ ప్రొఫెసర్లుగా దేశంలోని ప్రముఖ న్యాయ కోవిదులు వ్యవహరిస్తున్నారని వారితో త్వరలో ప్రత్యేక న్యాయ అంశాలపై ప్రసంగాలను ఏర్పాటు చేయనున్నామని డైరక్టర్ తెలిపారు. న్యాయ విద్యా కోర్సులు అభ్యసించే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా కోటి రూపాయలతో గ్రంథ సముదాయాన్ని ఏర్పాటు చేశామని అలాగే ప్రత్యేక మూట్ కోర్టు హాల్‌ను నిర్మించామని పేర్కొన్నారు. ప్రస్తుతం వివిధ రాష్ట్రాలకు చెందిన వంద మందికి పైగా విద్యార్థులు గీతం స్కూల్ ఆఫ్ లా లో న్యాయ విద్యను అభ్యసిస్తున్నారని డైరక్టర్ తెలిపారు.


గీతం స్కూల్ ఆఫ్ లా లో ప్రవేశం పొందగోరే వారు వివరాలకు గీతం వెబ్‌సైట్ www.gitam.edu ను పరిశీలించవచ్చునన్నారు.

## నూకాంబిక సన్నిధిలో వాసుపల్లి



అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబికా అమ్మవారిని మంగళవారం విశాఖ దక్షిణ నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యే, తేదేపా అసెంబ్లీ అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ తన సతీమణి ఉషా, తనయుడు సాకేత్‌తో కలిసి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈమేరకు ఆలయానికి విచ్చేసిన వాసుపల్లి దంపతులకు తేదేపా అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు మళ్ల సురేంద్ర ఆలయం వద్ద, మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. అనంతరం వాసుపల్లి దంపతులు ఆలయంలో నూకాంబినకను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి బయటకు విచ్చేసిన ఆయన పాత్రికేయులతో కాసేపు మాట్లాడారు. రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమేనని ఆశాభావం వ్యక్తం చేసారు. రాష్ట్ర అబివృద్ధిని చూసి ప్రజలు తెలుగుదేశానికి పట్టంకడతారని అని తెలిపారు. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడంకాయమని చెప్పారు.

## వివేకానందలో కందుకూరి వీరేశలింగం జయంతి వేడుకలు



విశాఖ సిటీ: స్థానిక శ్రీ స్వామి వివేకానంద విద్యా సంస్థల్లో ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం జయంతి వేడుకలు ప్రిన్సిపాల్ మరియు కరస్పాండెంట్ డాక్టర్ ఒమ్మి రఘురామ్ ఆధ్వర్యంలో జరిగాయి. ఆయన వీరేశలింగం చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కాలాల్లోనూ, అన్ని తరాల్లోను స్మరించుకో గలిగిన మహెూన్నత వ్యక్తి కందుకూరి వీరేశలింగం అన్నారు. ఈయన గోదావరి నదీ తీరాన రాజమహేంద్రవరంలో 1848 ఏప్రిల్ 16న జన్మించిన ఈయన సాంఘిక దురాచారాలపై దృష్టి సారించారన్నారు. 1905లో ఉపాధ్యాయ వృత్తికి స్వస్తి పలికి పూర్తి స్థాయిలో సంఘ సేవలోను, గ్రంథ రచనల్లోను గడిపేవారన్నారు. బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన మహెూన్నత వ్యక్తి వీరేశలింగం అని అన్నారు. స్త్రీలు విద్యావంతులు అయితే తప్ప సమాజం బాగుపడదని బావించిన ఈయన స్త్రీ విద్యపై అనేక ప్రచారాత్మక వ్యాసాలు రచించారు. సమాజంలో పెచ్చు పెరిగిన అవినీతి, మూఢ నమ్మకాలు, దేవదాసీ వ్యవస్థ, వేశ్యావృత్తి నిర్మూలించడానికి నడుం బిగించారన్నారు. ఈయన మద్రాసు, రాజమండ్రిలో శరణాలయను నిర్మించి తాను మరణించినా ఆ సంస్థలు నిరాటంకంగా కొనసాగడానికి హితకారిణి అనే సమాజాన్ని స్థాపించి తన యావదాస్తిని దాని పేరున రాశారన్నారు. సంఘ సంస్కర్తగా, శతాధిక గ్రంథకర్తగా, ఆంధ్ర కవులచరిత్ర రచయితగా నాటక, నవలా రచయితగా ప్రఖ్యాతి పొందిన కందుకూరి పుట్టిన రోజున తెలుగు రంగస్థల దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో వివేకానంద సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రముఖ సంఘ సేవకులు మాదేటి ఈశ్వరరావు మృతి

అనకాపల్లి : పట్టణంలో లక్ష్మీదేవిపేటకు చెందిన వ్యాపార వేత్త, ప్రముఖ సంఘ సేవకులు మాదేటి ఈశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు.ఆయన మరణ వార్త పలువురిని కలిచివేసింది. మాదేటి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పేరుతో పేద విద్యార్థులకు ప్రతీ ఏటా ఆగస్టు 15 వ తేదీన ఉత్తమ ర్యాంకును సాదించిన విద్యార్థులను రాష్ట్రంలో ప్రముఖ వ్యక్తులను తీసుకువచ్చి ఉత్తమ ప్రతిబా అవార్డులు అందించి విద్యార్థులను ప్రోత్సహించేవారు. ప్రతీ ఏటా పారితోషకాలు పంపిణీ చేస్తూ వస్తున్నారు. అలాగే, విశాఖ ఫైనాన్సియర్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా పనిచేసారు. లోక్‌సత్తా, స్వచ్ఛంద సంస్థగా ఉన్నప్పుడు గాని దానికోసం విశేష కృషి చేసారు. రాజకీయ పార్టీగా మారిన అనంతరం గుడ్‌బై చెప్పారు.

విశాఖపట్నం అనకాపల్లిలో పలువ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

మంగళవారం సాయంత్రం శారదానది స్మశాన వాటికలో అంత్య క్రియలు కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈయన మరణ వార్త విని అనేక మంది విచ్చేసి, కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలియజేసారు. విశాఖ ఫైనాన్సియర్ అసోషియేషన్ అధ్యక్షులు భీమరశెట్టి శ్రీనివాసరావు తదితరులు ఒక ప్రకటనలో సంతాపాన్ని తెలియజేసారు.

## పరీక్షల కేంద్రాన్ని పరిశీలించిన ప్రిన్సిపాల్

### ఆచార్య కె.రామ మోహన రావు



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆర్ట్స్ కళాశాల పరిధిలో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను ప్రిన్సిపాల్ ఆచార్య కె.రామ మోహన రావు ఉదయం పరిశీలించారు. స్వయంగా వివిధ విభాగాలను సందర్శించి పరీక్షలు జరుగుతున్న విధానాన్ని గమనించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంగా, సమర్థవంతంగా నిర్వహించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

గొలుగొండ : మండలంలోని పాకలపాడు గ్రామంలో సరుగుడు తోటల మధ్యలో వేలాడుతున్న విద్యుత్ తీగలు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. 33/11కెవి విద్యుత్‌ను సరఫరా చేసే ఈ తీగల వలన పెను ప్రమాదం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ తోటల్లోకి తరచూ మేతకు వచ్చే పశువులతో పాటు వాటిని కాసే కాపరులు విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. ఈదురు గాలులకు తీగల ఒకదానికొకటి తగిలినప్పుడు ఇప్పుడు నిప్పు రవ్వలు రాలి తోటలు అగ్నికి ఆహుతి అయ్యే అవకాశం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు.


రక్షణ మంత్రిత్వ శాఖ
నావల్ డాక్‌యార్డు, విశాఖపట్నం
(టెలిఫోన్: 0891 2816350, 6366 ఫ్యాక్స్: 0891 2816688)
ఇ-టెండరు ప్రకటన

కోటింగ్ నెం. **ఆర్‌పివైపి/పిఐ/18-19/234**

1. ఎన్‌డి(వి) వద్ద ఔట్ డిపార్ట్‌మెంటు కొరకు ఉపకరణములతో డిజిటల్ అల్ట్రాసానిక్ ఫ్లా డిటెక్టర్ ఏర్పాటుకై ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా సీలు చేసిన టెండర్లు కోరుచున్నారు.

2. ఇ-టెండరు డాక్యుమెంట్లు వెబ్‌సైటు: WWW.DEFPROC.GOV.IN నుంచి డౌన్‌లోడ్ చేసుకోగలరు. ధరావత్తు జమ క్రింద **రూ. 2,38,800/-**లకై ఏదేని జాతీయ బ్యాంకు నుంచి తీసిన డిమాండ్ డ్రాఫ్టును ఆఫ్‌లైను డాక్యుమెంటుతో జతచేసి పంపవలెను.

3. ఆఫ్‌లైను సీలు చేసిన టెండర్లు “ఎమ్‌వైపి” అన్ని మార్కు చేసి నేవల్ డాకుయార్డు విశాఖపట్నం యొక్క విజయ్‌నగర్ గేటు వద్ద గల బాక్సులో వేయుటగాని లేదా ఈ కార్యాలయానికి 11 ఆగస్టు 18 (1830 గం.లు) లోపు చేరేలా రిజిష్టరు పోస్టు ద్వారా పంపగలరు.

**డిజిఎమ్ (ఆర్‌పి)**

**davp 10702/11/0016/1920**

# విజయభాను సంపాదకీయం

## మహాద్భుతం!! కృష్ణబిలం

అంతరిక్షంలో అల్లంతదూరాన ఉన్న కృష్ణ బిలాన్ని భూగోళంలోని టెలిస్కోపుల సమన్వయంతో చిత్రీకరించగలుగడం శాస్త్రవిజ్ఞానంలోనే కాదు సాంకేతికరంగంలో కూడా మానవులు సాధించిన ప్రగతికి నిదర్శనం. విజ్ఞానశాస్త్రంలో అనే ఆవిష్కరణలు మానవులు తమ అనుభవాలతో, ప్రయోగాలతో ఆవిష్కరించినవే. అయితే ఇంద్రియ జ్ఞానానికి అతీతంగా ఉన్న అనేక వైజ్ఞానిక సత్యాలను, సూత్రాలను మానవులు బౌద్ధికశక్తితో గ్రహించగలిగారు. తర్కబద్ధమైన ఆలోచనాధోరణి అనేక విశ్వ సూత్రాలను ఆకళింపు చేసుకోవడానికి దారితీసింది. కృష్ణ బిలానికి సంబంధించిన పరిజ్ఞానం కూడా ఆ విధంగా సమకూర్చుకున్నదే. భౌతిక శాస్త్రవేత్త ఐన్‌స్టీన్, అంతరిక్ష పరిశోధకుడు, భౌతికవేత్త స్వార్జ్‌చైల్డ్ తదితరులు గణిత సూత్రాల ద్వారా కృష్ణబిలాల ఉనికిని ఊహించగలిగారు. ఇంతకాలం మనం చూస్తున్న కృష్ణ బిలం సూత్రాలు చిత్రకారులు ఊహించి గీసినవే తప్ప ఎవరూ చూసింది లేదు. కానీ మానవుడు టెలిస్కోపుల ద్వారా నైనా కృష్ణ బిలాన్ని చూడగలగడం అద్భుతమే. ప్రపంచమంతటా నెలకొని ఉన్నటెలిస్కోపులను సంధానం చేయడం వల్ల భూగోళమే ఒక ప్రయోగశాల మాదిరిగా మారిపోయింది. ఈ టెలిస్కోపుల మధ్య సెకనులో శతకోటి వంతు కూడా తేడాలేకుండా సంకేతాలను సమన్వయం చేసుకొని పరిశోధించడం అసాధారణం. ఆ పరిశీలనల డేటాను భరించే శక్తి ఇంటర్‌నెట్‌కు లేకపోవడంతో, హార్డ్‌డ్రైవ్‌ల ద్వారా ఒకచోట చేర్చి సమన్వయం చేశారు. కంప్యూటర్ అల్గోరిథమ్స్ నిర్మించడం కూడా ఈ పరిశోధన విజయవంతం కావడానికి కారణమే. జీవుల జన్యు రహస్యాలను విప్పి చూడటమైనా, అంతరిక్షంలోకి తొంగిచూడటమైనా ఇటీవలి కాలంలో మానవులు సాధిస్తున్న పురోగతిని సూచిస్తున్నాయి. కృష్ణబిల స్వభావాన్ని సింగులారిటీగా అభివర్ణిస్తున్నప్పటికీ, దానిని నిర్వచించడం కూడా సాహసమే. కృష్ణబిలం గురించి తెలుసుకోవడం అంటే విశ్వ రహస్యాలను తెలుసుకోవడానికి చేసే ప్రయత్నమే. మహా విస్ఫోటం జరిగి విశ్వం విస్తరిస్తూ పోతున్నదనే వాదన అంగీకరించినా, అందుకు సంబంధించిన అవగాహన ఇంకా పట్టుబడవలసి ఉన్నది. అణువు, పరమాణువు వివిధ పదార్థాల నిర్మాణానికి సంబంధించి మనం చెప్పుకునే ప్రామాణిక భౌతిక సూత్రాలు విశ్వంలోని నాలుగోవంతు పదార్థానికి మాత్రమే వర్తిస్తాయి. టెలిస్కోపుల ద్వారా గ్రహించిన కృష్ణ బిలం చిత్రంతోపాటు ఆ చుట్టూ వాయువుల వలయం కూడా చూడగలుగుతున్నాం. కృష్ణ బిల చిత్రం కొంత మసకగా ఉన్నప్పటికీ, సంతృప్తికరంగా ఉందనీ, భవిష్యత్తులో టెలిస్కోపులను పెంచడం ద్వారా మరింత స్పష్టమైన చిత్రాలు వస్తాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ కృష్ణ బిలం భూమి కి ఐదున్నర కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నది. మన భూమి లేదా సౌరమండలం ఉన్న ది పాలపుంత అనే నక్షత్ర రాశిలో కాగా, ఈ కృష్ణ బిలం ఉన్నది పొరుగున ఉన్న ఎం87 అనే నక్షత్రరాశిలో. ప్రతి నక్షత్ర రాశిలో ఇటువంటి కృష్ణ బిలాలుంటాయి. భారీ నక్షత్రం అంతరిస్తున్నప్పుడు ఇటువంటివి ఏర్పడుతాయి. ఈ కృష్ణ బిలానికి బ్రహ్మాండమైన గురుత్వాకర్షణ శక్తి ఉం టుంది. చుట్టూరా పదార్థాన్నీ, శక్తినీ తనలోకి ఆకర్షించుకుంటుంది. కాంతిని కూడా బయటకు పో నీయదు. అందువల్లనే నల్లబిలంగా కనిపిస్తుంది. నల్లబిలం చుట్టూరా ఈవెంట్ హారిజన్‌గా చెప్పుకునే హద్దు ఉంటుంది. ఈ నల్లబిలం ప్రభావం విస్తరించి ఉన్న ప్రాంతంలో ని పదార్థమంతా ఈవెంట్ హారిజన్ వైపు వచ్చి అందులో పడిపోతుంది. ఈవెంట్ హారిజన్‌లోకి వచ్చిన పదార్థమైనా, శక్తియైనా వెనుకకు పోవడమనేది ఉండదు. అణు స్వరూపంలేని ప్లాస్మా ఏర్పడి, అత్యంత ఉష్ణం నెలకొని ఉంటుంది. గ్రహాలు సూర్యుడి ఆకర్షణ నుంచి తప్పించుకోవడానికి పరిభ్రమించినట్టుగానే, పదార్థం ఆకర్షణను తట్టుకు నే ప్రయత్నంలో పరిభ్రమిస్తుంది. పైకి ఎగజల్లే కాంతిపుంజాలు కూడా వంగిపోతాయి. కోట్లాది సూర్యులకు సమానమైన కాంతి ఉండటం వల్ల మనం చూడగలుగుతున్నాం. ఈవెంట్ హారిజన్ వైపు వచ్చిన పదార్థం క్రమంగా మసకబారి పతనమవుతుంది. అందులోని పదార్థం స్వభావస్వరూపాల గురించి మనకు కనీసం అంచనా కూడా లేదు. ఈవెంట్ హారిజన్‌లో ద్రవ్యరాశి, శక్తి అనంతమైనదిగా ఉండి అత్యంత దట్టంగా కూరుకుపోయి ఉంటుంది. ఈవెంట్ హారిజన్‌లో మనం చెప్పుకుంటున్న భౌతిక సూత్రాలన్నీ అసంబద్ధమైపోతా యి. కృష్ణబిల స్వభావాన్ని సింగులారిటీగా అభివర్ణిస్తున్నప్పటికీ, దానిని నిర్వచించడం కూడా సాహసమే. కృష్ణబిలం గురించి తెలుసుకోవడం అంటే విశ్వ రహస్యాలను తెలుసుకోవడానికి చేసే ప్రయత్నమే. మహా విస్ఫోటం జరిగి విశ్వం విస్తరిస్తూ పోతున్నదనే వాదన అంగీకరించినా, అందు కు సంబంధించిన అవగాహన ఇంకా పట్టుబడవలసి ఉన్నది.

## రాయుడిని చూస్తే గుండె పగిలేంత బాధ: గంభీర్



దిల్లీ: హైదరాబాదీ ఆటగాడు అంబటి రాయుడు ప్రపంచకప్ జట్టుకు ఎంపిక కాకపోవడం బాధ కలిగిస్తోందని టీమిండియా మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ అన్నాడు. రిషబ్‌పంత్ తనకు లభించిన అవకాశాలను అందిపుచ్చుకోలేదని వెల్లడించాడు. ఇప్పుడు చర్చ జరగాల్సింది అంబటి రాయుడి గురించేనని పేర్కొన్నాడు.

తెలుపుబంతి క్రికెట్‌లో 48 సగటు, 33 ఏళ్ల వయసున్న క్రికెటర్‌ను వదిలేయడం చాలాచాలా దురదృష్టకరం. మిగతా సెలక్షన్ నిర్ణయాలతో పోలిస్తే నాకైతే ఇది గుండెపగిలేంత బాధగా అనిపిస్తోంది. రాయుడి పట్ల విచారం వ్యక్తం చేస్తున్నా. 2007లో నన్ను ఎంపిక చేయనప్పుడు నేనిలాంటి పరిస్థితే ఎదుర్కొన్నా. ప్రపంచకప్‌నకు ఎంపికవ్వకపోవడం ఎంత కష్టంగా ఉంటుందో నాకు తెలుసు. ఇది ప్రతి ఒక్కరి కల. ఎంపికవ్వని మిగతా క్రికెటర్లతో పోలిస్తే రాయుడిని చూస్తేనే హృదయం ద్రవిస్తోంది అని గంభీర్ అన్నాడు. ఏడాదిన్నర కాలం బాగా ఆడిన అంబటి రాయుడు సొంతగడ్డపై ఆస్ట్రేలియా సిరీస్‌లో రాణించలేదు. దీనిని పరిగణనలోకి తీసుకొని సెలక్టర్లు వేటువేశారని భావిస్తున్నారు.

రిషభ్‌పంత్‌ను తీసుకోకపోవడం ఎదురుదెబ్బ ఎలా అవుతుంది? వన్డే క్రికెట్‌లో అతడు నిలకడగా రాణించలేదు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోలేదు. దీన్ని ఎదురుదెబ్బ అనొద్దు. పంత్ టెస్టు క్రికెట్ ఆడాడు. అందుకు సంతోషించాలి. అతడికింకా చాలా వయసుంది. ఎవరైనా సరే వర్తమానంలోనే ఉండాలి. అనుభవం, మ్యాచ్‌లు ముగించడం రీత్యా పంత్ కన్నా డీకే మెరుగని సెలక్టర్లు భావించొచ్చు. వన్డే క్రికెట్‌లో చాలాకాలం దినేశ్ కార్తీక్ బ్యాకప్ కీపర్‌గా ఉంటున్నాడు. నా దృష్టిలో మాత్రం సంజు శాంసన్ రెండో వికెట్‌కీపర్‌గా బాగుంటాడు. సుదీర్ఘకాలం నాలుగో స్థానంలో ఆడగలడు అని గంభీర్ అన్నాడు.

## ఆ పార్టీలను సాగనంపాలి: కమల్



సైదాపేట: స్టెరిలైట్ పరిశ్రమకు అనుమతి ఇచ్చింది ఒక పార్టీ అని, విస్తరణకు అవకాశం కల్పించింది మరో పార్టీ అని ఎంఎన్‌ఎం అధ్యక్షుడు కమల్‌హాసన్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలను సాగనంపాలని తెలిపారు. తూత్తుకుడి లోక్‌సభ ఎంఎన్‌ఎం అభ్యర్థి పొన్‌కుమార్, విళాత్తికులం అసెంబ్లీ అభ్యర్థి నటరాజన్‌లకు మద్దతుగా ఆయన తూత్తుకుడిలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూత్తుకుడి అంటేనే ఓడరేవు గుర్తుకు రావాలన్నారు. కానీ తుపాకీ కాల్పులు గుర్తుకు వస్తున్నాయని తెలిపారు. దేశాన్ని విభజించే శక్తులు రాష్ట్రంలోకి చొరబడ్డాయని, వాటిని తొలగించాలని పేర్కొన్నారు. స్టెరిలైట్ పరిశ్రమ వద్దని తాను చెప్పటం లేదని తెలిపారు. దాని కాలుష్యంతో ప్రజలకు ఎలాంటి హానీ జరగకుండా చూడాలన్నారు. తమిళులకు వినయం, పరాక్రమం రెండూ ఉంటాయని వ్యాఖ్యానించారు.

అందులో వినయాన్ని ఉపయోగించుకుని తమిళులను బానిసలుగా చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. స్టెరిలైట్ ఆందోళనలో కాల్చింది తమిళుడే, కాల్చమని చెప్పిందీ తమిళుడేనని గుర్తుచేశారు. తాను 20 ఏళ్లకు ముందు రాజకీయాలలోకి వచ్చుంటే ఈ అన్యాయం జరిగేది కాదని తెలిపారు. తమిళనాడు చరిత్రను తిరగరాసే రోజు దగ్గర్లో ఉందని పేర్కొన్నారు. తాను పోటీ చేయకపోవటం గురించి కొంత మంది ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఎంఎన్‌ఎం తరఫున పోటీ చేసే అభ్యర్థులంతా తన ప్రతిరూపాలని వ్యాఖ్యానించారు. వారిని ఎన్నికలలో గెలిపించి వారు చేసే పనుల ద్వారా ప్రజలు తనను చూడొచ్చని పేర్కొన్నారు.

## నా వల్లే ఆమెకు గుర్తింపు : కుమారస్వామి

మండ్య: బహుభాషా నటి సుమలతకు తన వల్లే ప్రజల్లో ఈ స్థాయి గుర్తింపు వచ్చిందని కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమార స్వామి అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండ్యలో నిర్వహించిన ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నా వల్లే సుమలతకు ఈ గుర్తింపు వచ్చింది. ఆమె మండ్య మొత్తం తిరుగుతూ జేడీఎస్ పార్టీకి చెందినవారు దొంగలని ప్రచారం చేస్తుంది. మీలాంటి పుణ్యాత్ముల వల్లే నేను ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యాను. ఇంకెవరి వల్ల కాదు అని ర్యాలీకి హాజరైన ప్రజలనుద్దేశించి మాట్లాడారు.

కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించిన సుమలతకు నిరాశ ఎదురుకావడంతో మండ్య నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఆ స్థానానికి మార్చి 20న నామినేషన్ దాఖలు చేశారు. ఆమె కుమారస్వామి తనయుడు నిఖిల్ కుమారస్వామి మీద పోటీ పడుతున్నారు. కర్ణాటకలో ఏప్రిల్ 18, 23న రెండు, మూడు దశల్లో పోలింగ్ జరగనుంది. మే 23న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

## వారణాసి నుంచే ప్రియాంక పోటీ: వాద్రా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ తూర్పు ఉత్తరప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ప్రియాంక గాంధీ వారణాసి నుంచి పోటీ చేయాలనుకుంటున్నట్టు ఆమె భర్త రాబర్ట్ వాద్రా వెల్లడించారు. ప్రియాంక పోటీపై వాద్రా మీడియాకు వెల్లడించడం ఇదే మొదటిసారి. వారణాసి నుంచి పోటీ చేసేందుకు ప్రియాకం సిద్ధంగా ఉన్నారని, అందుకు ఆమె అంగీకరించారని వాద్రా తెలిపారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానిదే తుది నిర్ణయమని చెప్పారు.ఇటీవల కాలంలో ప్రియాంక సైతం తాను ఎన్నికల బరిలో దిగే అవకాశాలున్నాయంటూ సంకేతాలు ఇచ్చారు. సోనియాగాంధీ నియోజకవర్గమైన రాయబరేలి నుంచి పోటీ చేయవచ్చు కదా అని ఇటీవల మీడియా ప్రశ్నించినప్పుడు వారణాసి నుంచి ఎందుకు చేయకూడదని ప్రశ్నించారు. దీంతో, వారణాసి నుంచి నేరుగా ప్రధాని మోదీపైనే పోటీ చేయాలని ఆమె పట్టుదలతో ఉన్నట్టు సంకేతాలు వెళ్లాయి. పార్టీ ఆదేశిస్తే ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానని, పార్టీ అప్పగించిన బాధ్యతలు నెరవేర్చడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమని కూడా ప్రియాంక చెప్పారు. కాగా, ఈనెల 26న వారణాసి నుంచి ప్రధాని మోదీ నామినేషన్ వేయనున్నారు.

కాంగ్రెస్ మాత్రం ఇంకా వారణాసి అభ్యర్థి విషయంలో సస్పెన్స్ కొనసాగిస్తోంది.

## సమయం

### మానవుడా

మానవుడా ! మహనీయుడా
లేవరా! లేచి నీ జాతిని జాగృతి చేయరా
భువికి దివికి మార్గమేసి
దివ్య జ్యోతి వెలిగించరా ॥మాన॥
ఆ జ్యోతి కాంతిని విశ్వమంత చూపరా
శాంతి దాంతి కల్గి విహరించరా
విశ్వ కల్యాణమే నా మతమని సాటి చెప్పరా
మనుషులంతా ఒకటే.. మమత కావాలి రా.. ॥మాన॥
మమతలోని మాధుర్యం మనుగడకే మూలం
జీవులన్ని ఒకటే ఆ దేవదేవి రూపం
విశ్వమాత ఒడిలో ఆడిపాడరా
పాటలన్నీ మాతకే అంకితమనరా ॥మాన॥

...కవితా రచన
సి.హెచ్.గంగరాజు

## పంచాంగం

మాసం : చైత్ర , తిథి : త్రయోదశి రా. 8.58; ఉత్తర రా.10.26; ఉ.వ.6.40ల 8.10.

బుధవారం 17-04-2019

**మేషం** : ఇతరులకు వాహనం ఇవ్వడంవల్ల ఇబ్బందులను ఎదుర్కుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. ఉద్యోగరీత్యా దూర ప్రయాణాలు చేయవలసివస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడరు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. గృహ నిర్మాణానికి సంబంధించిన ప్లానుకు ఆమోదం లభిస్తుంది.

**వృషభం** : ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. ప్రముఖులతో పరిచయాలు వ్యాపకాలు అధికమవుతాయి. మిత్రులతో కలిసి షాపింగ్ చేస్తారు.

**మిథునం** : ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. బ్యాంకు రుణాలు తీర్చడంతో పాటు కొంత రుణం తీసుకుంటారు. బంధువుల మధ్య సయోధ్య లోపిస్తుంది

**కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు సమర్థంగా పరిష్కరిస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు..

**సింహం** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు.

**కన్య** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

**తుల** : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నవ యలు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తికీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు.


**వృశ్చికం** : కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు.

**ధనుస్సు** : ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**మకరం** : ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సాను కూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి.యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు.

**కుంభం** : స్త్రీలు చీటికి, మాటికి అసహనం, చికాకులు అధికమవుతాయి. అయిన వారిని, ఆప్తులనువిందు భోజనానికి ఆహ్వానిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు వాయిదాపడతాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరా స్తుల కొనుగోలు యత్నాలు అను కూలిస్తాయి. మీ ఏమరుపాటుతనం, హడావుడి వల్ల వస్తువులు చేజార్చు కుంటారు. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలు దారు లను ఆకట్టు కుంటారు.

**మీనం** : ప్రతి చిన్న విషయానికి ఇతరులపై ఆధారపడటం మంచిది కాదు. ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు సమసిపోతాయి. వైద్యరంగాల్లోనివారికి శస్త్రచికిత్సల సమయంలో ఏకాగ్రత అవసరం. ఇసుక, భవన నిర్మాణ కాంట్రాక్టర్లకు ఆటుపోట్లు తప్పవు.



## లక్ష్మీదేవి స్వరూపమైన గోదాదేవి వృత్తాంతం!!

### సంకీర్తన

లక్ష్మీ స్వరూపమైన గోదాదేవి శ్రీరంగంలో క్రీ.శ 776లో జన్మించినట్లు పురాణాలు చెపుతున్నాయి. ద్రవిడ భాషల్లో గోదాదేవికి కోద్తె, చూడిక్కొడుత్త నాచ్చియార్, ఆండాళ్, అనే నామాంతరములు గలవు. తెలుగు సాహిత్యంలో సాహితీ సమరాంగణ సార్వభౌముడిగా ప్రఖ్యాతి వహించిన విజయనగర చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయలు రచించిన తెలుగు ప్రబంధం ఆముక్తమాల్యద గోదాదేవీ వైశిష్ట్యమునకు ప్రతీక. ఈ ప్రబంధానికి విష్ణుచిత్తీయం అనే మరోపేరున్న సంగతి తెలిసిందే.

ఇక గోదాదేవి జన్మ వృత్తాంత్తాన్ని ఓ సారి పరిశీలిస్తే.. శ్రీరంగంలో ఆషాఢ శుద్ధ చతుర్దశిన, పుబ్బ నక్షత్రంలో గోదాదేవి జన్మించింది. గోదాదేవి, శ్రీ విష్ణుచిత్తులకు పూలతోటలో లభించిన కుమార్తె. ఈమెను విష్ణుచిత్తుల దంపతులు చాలా అల్లారుముద్దుగా పెంచుకున్నారు. యుక్త వయస్సులో వచ్చిన తర్వాత లక్ష్మీస్వరూపమైన గోదాదేవి, తన శ్రీవారు అయిన రంగనాథుడినే తన పతిగా పొందాలనుకుంటుంది.

వైష్ణవుడైన విష్ణుచిత్తుడు రంగనాథ స్వామిని ప్రతినిత్యం భక్తిశ్రద్ధలతో కొలిచేవాడు. ఇందులో భాగంగా... ప్రతిరోజూ స్వామివారికి పూలమాలలను సుందరంగా అల్లుకుని అలంకరణకు తీసుకుని వెళ్లేవాడు. అయితే వాటిని గోదాదేవి ముందే ధరించి తర్వాత స్వామివారికి పంపిస్తుంది.

ఈ రహస్యం తెలుసుకున్న విష్ణుచిత్తుడు దుఃఖించి రంగనాథుడికి మాలాధారణ గావించరు. దీంతో స్వామివారి మొహం చిన్నబోతుంది, దీనికంతటికీ తన కుమార్తె తప్పిదమే కారణమని విష్ణుచిత్తుడు బాధపడుతుంటే.. రంగనాథుడు విష్ణుచిత్తునితో ఇక ప్రతిరోజూ తనకు గోదాదేవి ధరించిన మాలాధారనే కావాలని ఆదేశిస్తారు. రంగన్న ఆదేశం మేరకే విష్ణుచిత్తుడు నడుచుకుంటాడు. గంతలో శ్రీరంగనాథుడే తనకు భర్తగా రావాలని కోరుకుంటూ గోదాదేవి... తన తోటి బాలికలతో కలిసి తిరుప్పావై (తిరుప్పావు) వ్రతాచరణ చేస్తారు. ఈ వ్రతమహిమతో... లక్ష్మీ స్వరూపమైన గోదాదేవి శ్రీరంగనాథుడి సతీమణి అవుతుంది. రంగనాథుడి ఆజ్ఞమేరకే గోదాదేవికి, రంగనాథస్వామికి విష్ణుచిత్తుడు దేవేరులకు భూలోకంలో వైభవంగా వివాహం జరిపించాడని పురాణాలు పేర్కొంటున్నాయి. వివాహానంతరం గోదాదేవి ఆ చిద్విలాసునిలో లీనమవుతుంది. అదిచూసి విష్ణుచిత్తుడు దుఃఖితుడైతే మలయప్ప స్వామి జ్ఞానోపదేశం చేస్తాడు. దీంతో విష్ణుచిత్తుడు గోదాదేవి లక్ష్మీస్వరూపి అని, తన కుమార్తె అన్న మాయ నుంచి బయటపడతాడు. ఇకపోతే... గోదాదేవి వ్రతాచరణ సమయంలో రచించిన తిరుప్పావై చాలా ప్రసిద్ధి చెందింది.

దీనిని ధనుర్మాసంలో ప్రతిరోజూ రోజుకొక్కటి చొప్పున ఓ పాశురం వైష్ణవ ఆలయాల్లో పఠించడం చేస్తారు. అందుచేత యువతులు ధనుర్మాసంలో 30 రోజుల పాటు గోదాదేవి వ్రతాచరణ చేస్తే తను మెచ్చిన, సుగుణుడైన భర్త లభిస్తాడని పురాణాలు చెబుతున్నాయి.




**ప్లాట్లు అమ్మకంనకు గలవు**

సబ్బవరం మండలంలో ఆరిపాక మెయిన్‌రోడ్డులో 22 సెంట్లు, 190 చ॥గ॥, 173 చ॥గ॥ ఇల్లు వుడా ప్లాట్లు మరియు పంచాయితీ ప్లాట్లు అమ్మకంనకు కలవు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 9866955823; 8247641310

## ఆసుపత్రుల్లో బయోమెడికల్ వేస్టేజ్ నాశనం చేయాలి



విజయనగరం: ఆసుపత్రుల్లో బయోమెడికల్ వేస్టేజ్ ఒక పద్ధతి ప్రకారం నాశనం చేయటం లేదని దీనివల్ల అనేక అనర్థాలుంటాయని జిల్లా కలెక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తన ఛాంబర్‌లో జిల్లాస్థాయి మోనటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఐదుగురుతో మోనటరింగ్ కమిటీ ఏర్పాటు చేశామని వీరు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు పరిశీలించి నివేదిక తయారు చేయాలని అన్నారు. ప్రతి ఆరునెలలకు ఒకసారి రాష్ట్రస్థాయి పొల్యూషన్ కంట్రోల్‌బోర్డ్‌కు తదుపరి చర్యలు నిమిత్తం పంపించాలని అన్నారు. ఒక ప్రణాళికబద్ధంగా నివేదికలు తయారుచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ నర్సింగరావు, డిఆర్‌ఓ జె.వెంకట రావు, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ పి.సుదర్శన్, ఎఐ సూర్యకళ, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన అవసరం

### : జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్

విజయనగరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలికవసతుల కల్పన, చిన్నారులకు పౌష్టికహారాం , శారీరక ఎదుగుదలకు అవసరమైన చర్యలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. అన్నిశాఖల సమన్వయ అవసరమని ఈ సందర్భంగా తెలిపారు. మంగళవారం ఐసిడిఎస్, వైద్యఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. అద్దెభవనాల్లో ఉన్న కేంద్రాలు సొంతభవనాల్లోకి మారేలా నిధులు సమకూర్చుతామన్నారు. సంబంధిత రెవిన్యూ అధికారుల ద్వారా స్థల సేకరణ చేస్తామన్నారు. 2,159 కేంద్రాలకు పొంతతభవనాలు లేక నడుస్తున్నాయన్నారు. తెర్లాం, మొరకముడిదాం, ప్రాంతాల్లో న్యూట్రీగార్డెన్స్ పెంపకంలో వెనుబడ్డాయని అన్నారు.యునెసెఫ్ సాయం తీసుకుని తల్లిపాలు పిల్లలకు అందించే విషయల్లో గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. పరిశుభ్రతపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. విటమిన్-ఎ లోపం ఉండే పిల్లలను ముందుగా గుర్తించి మందులు ఇవ్వాలన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో పాఠశాలలకు అవసరమైన సౌకర్యాల కల్పన కోసం ముందుగా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

**Reply notice**

**Late Bora Appalanarasayy Reddy S/o. Varahalu Reddy his spouse and children Visakhapatnam. Published notice to General public is Andhra Jyothi Daily News Paper Dt. 4-4-2019 for that notice Reply notice by my client Bora Suri Reddy S/o. Varahalu Reddy, Marripalem, Visakhapatnam.**

**My client filed a suit in IInd Add.Junior Civil Judge at Visakhapatnam. in O.S.No.88/2014 against your clients & 12 others, for the above suit schedule property, and my client obtained decree against your clients on 31-7-2017. As per the Decree Honourable Court grant injunction and not to interfering with the peaceful possession and enjoyment of the suit schedule property, including the feature construction with their developer without due process of law.**

**My client's mother late Bora Appalanarasamma bequeath Reg.will dt.24-7-1996 in favour of my client above the suit schedule property. My client is absolute owner of the schedule property and he enjoying the property without any interuption what so ever. That your client's have no right what so ever on the above schedule Property.**

**Md.SOHEB**
M.com.,M.A,D.M.M.B.L
**Advocate**
**D.No.30-46-59/1, Main Road,**
**Reddy Kancharapalem.**
**Visakhapatnam - 530 008**
**Cell : 9440190706**

**నోటీసు ( I.A.నోటీసు)**

**మహారాజశ్రీ చోడవరం IX అడిషినల్ అండ్ సెషన్స్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టు వారి దివ్య సముఖమునకు**

**IA 195/2018 in AS 163/2012**

**పొసిన మోహనరావు** ...**పిటిషనర్లు-అప్పిలెంటు**
**పొసిన అమ్మాజి & వగైరాలు** ...**రెస్పాండెంట్లు**

**To**
**6వ రెస్పాండెంటు**
**పొసిన లక్ష్మి**
**W/o.శ్రీనివాసరావు**
**సా॥ నరసింగరావు, పెద కలవలపల్లి గ్రామం, రాంబిల్లి మండలం**

పై నెంబరు పిటిషను పరిహారములు కోరుచూ పిటిషను దాఖలు చేసినందున యిందు విషయమై మీకు ఎట్టి అక్షేపణలు యున్న 2019వ సంవత్సరం **ఏప్రిల్ నెల 26వతేదీ ఉదయం 10 గంటలకు** వాయిదా వున్నందున పై కోర్టు ముందు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరయి కోర్టు వారితో మనవి చేసుకొనవలసినది. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయు దురని తెలియజేయడమైనది.

**B.V.D.Jagannadha Rao**
**(Advocate for Petitioner/Plaintiff)**
**Chodavaram.**

# సొంత భవనం నుంచి పోలీస్ సేవలు



మధురవాడ : మధురవాడ మిధిలాపురి వుడా కాలొనీలో ఇంతవరకు నిర్వహించిన పీఎంపాలెం పోలీస్ స్టేషన్ సోమవారం నుండి రెవెళ్లపాలెం నందు గల నూతన భవనంలోకి తరలించినట్టు పీఎంపాలెం సిఐ సూర్యనారాయణ తెలిపారు, డీజీపీ చేతుల మీదగా గత నెలలో ప్రారంభించిన విషయం అందరకి తెలిసిందే, శాంతి భద్రతలు తో పాటు నేర విభాగానికి సంబంధించి పూర్తి స్థాయి సేవలు ఇకపై ఇక్కడినుంచే అందించనున్నామన్నారు ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలని అలాగే ఫిర్యాదు దారులు రెవెళ్లపాలెంలో ఉన్న నూతన భావానికి రావలసిందినంగా సిఐ కోరారు, అందరకి అనుకూలంగా అందుబాటులోవుండే విధంగా నూతన భవనాన్ని ఏర్పాటు చెయ్యడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## తూఫాన్ సంభవించే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలుపై మాక్ డ్రిల్



భీమునిపట్నం : భీమిలి మండలం చేపలుప్పాడ లో నేషనల్ డిసాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ మరియు స్టేట్ డిసాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ ఆదేశాల మేరకు రీజనల్ రెస్పాన్స్ సెంటర్ విశాఖపట్నం వారు భీమునిపట్నం మండలం చిప్పాడ గ్రామంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం రీజనల్ రెస్పాన్స్ సెంటర్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ తుఫాను అంటే ఏమిటి తూఫాన్ సంభవించే సమయంలో ప్రజలు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలి వాటి తో పాటు ప్రాణ ఆస్థి నష్టాలను ఎలా తగ్గించు కోవాలి అనే అంశాలపై మత్స్యకారులకు ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఇందులో భాగంగా తుఫాను సమయంలో భారీ వృక్షాలు నేలకు ఒరిగి నపుడు వాటిని మన వద్ద ఉన్న పరికరాలతో ఎలా తొలగించాలి అన్న విషయాలపై సిబ్బందితో అవగాహన కల్పించారు. అలాగే తుఫాను సమయంలో తీర ప్రాతంలో ఉండేవారు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలి తమను తాము కాపాడుకుంటూ ఇతరులను ఎలా కాపాడాలో కూడా వారు ఈ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ డిపార్ట్మెంట్, కోస్ట్ గార్డ్ డిపార్ట్మెంట్, తహసిల్దార్ టి. కళ్యాణ చక్రవర్తి, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ఎఫ్‌డిఓ పి శ్రీనివాసరావు, పోలీస్ డిపార్ట్మెంట్ తదితర డిపార్ట్మెంట్లు పాల్గొన్నారు.

# రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదు



యలమంచిలి : ఈ నెల 11న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లలో చైతన్యం వెల్లువెత్తింది. గతంలో కంటే అధిక శాతం ఓటర్లు తమ ఓటును వినియోగించుకుని చరిత్ర సృష్టించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గరిష్టంగా 81.2 శాతం ఓట్లు పోలవడం విశేషమని అధికారులు అంటున్నారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలలో యలమంచిలి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,97,602 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,66,952 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండలాల వారీగా పోలైన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి.

| యలమంచిలి నియోజకవర్గంలో పోలైన ఓట | పోలింగ్ కేంద్రాలు | పురుషులు | స్త్రీలు | మొత్తం |
|---|---|---|---|---|
| మండలం | యలమంచిలి66 | 21,943 | 23,684 | 45,627 |
| రాంబిల్లి | 52 | 17,044 | 17,376 | 34,420 |
| మునగపాక | 55 | 18,325 | 18,548 | 36,873 |
| అచ్యుతాపురం | 70 | 25,663 | 24,369 | 50,032 |
| మొత్తం | 243 | 82,975 | 83,977 | 1,66,952 |

## పెద్దాపురం డివిజన్లో ప్రతి గ్రామంలోనూ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి : ఆర్డీవో ఎన్ఎస్‌విబి. వసంతరాయుడు



పెద్దాపురం పెద్దాపురం డివిజన్లో ప్రతి గ్రామంలోనూ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, డివిజన్లోని ఎంపీడీవోలను ఆర్డీవో ఎన్ఎస్‌విబి. వసంతరాయుడు ఆదేశించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో పెద్దాపురం డివిజన్‌కు సంబంధించి ప్రభుత్వ వైద్యులు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులతో ఆర్డీవో అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ రోజురోజుకు ఎండలు తీవ్రతరం అవుతున్న కారణంగా మండలస్థాయి అధికారులు ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ ఎన్జీవో, దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరును ప్రజలకు అందజేయాలని తెలిపారు. చలి వేంద్రాలు ఏర్పాటుకు సంబంధించి నివేదికను తయారు చేసేప్రతిరోజు ఆర్డీవో కార్యాలయానికి రోజువారీ రిపోర్టును పంపించాలని అన్నారు. ఎంపీడీవోలు, తహశీల్దార్లు మండలంలోని పిహెచ్‌సి డాక్టర్లు, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, పంచాయితీ సెక్రటరీలు గ్రామాల్లో వడదెబ్బ తగలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు 12 గంటలలోపు పనులు ముగించా లన్నారు. చలివేంద్రాలలో మజ్జిగ అందించడానికి కృషి చేయా లన్నారు. ఈ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని తక్షణమే దగ్గరలో ఉన్న ప్రాథమిక వైద్య కేంద్రానికి తీసుకువెళ్లి చికిత్స అందజేయాలన్నారు. వడదెబ్బకు చనిపోయారని నిర్ధారణ జరిగితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాలన్నారు. పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబర్ 08852 242044, 241254 ద్వారా సమాచారం తెలియజేయాలన్నారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎమ్‌హెచ్‌ఓ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పంపిణీకి అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అవసరం మేరకు పిహెచ్‌సి కేంద్రాలలో అందుబాటులో ఉంచామని, వీటి పంపిణీని ఆశావర్కర్లు ద్వారా చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నాంచారయ్య, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, డాక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ కాంగ్రెస్‌పార్టీ విస్తృతంగా ఎన్నికల ప్రచారం

యానాం : పుదుచ్చేరి పార్లమెంటు ఎన్నికలలో ఎన్ఆర్. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్ధి డాక్టరు కె.నారాయణస్వామికి ఓటు వేసి గెలిపించాలని వివిధ గ్రామాలలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళవారం వీరు గ్రామాలైన సావిత్రినగర్, గిరియంపేట, దరియాల తిప్ప, సీతారామనగర్, దొమ్మేటిపేట, అయ్యనగర్, వైఎస్ఆర్ కాలనీ, కురసాం పేటల మీదుగా రోడ్‌షో నిర్వహిస్తూ ఓటర్లకు అభివాదం చేస్తూ ఓటు వేయాలని కోరారు. ఈ ప్రచారంలో ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి తిరికోటి భైరవస్వామి, అధ్యక్షులు మల్లాడి శ్యాముల్, నల్ల వెంకన్న, శ్రీమంతుల శ్రీధర్, తిరికోటి నాగేశ్వరరావు, శ్రీను, చింలపూడి సత్యనారాయణమూర్తి, త్రిపాఠి, గోపి, వందలాది మంది నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మాక్ డ్రిల్



భీమునిపట్నం : దొరతోట లోని నవజీవన్ స్కూల్ ఆవరణలో అగ్నిమాపక వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు విద్యార్థులకు వివరించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఎలా బయటకు రావాలో మాక్ డ్రిల్ చేసి విద్యార్థులకు చూపించారు. ఫైర్ ఆఫీసర్ షేక్ మదీనా ఆధ్వర్యంలో జరిగిన ఈ విన్యాసాలలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని ఉపాధ్యాయులు అన్నారు.

## 18న జిల్లా స్థాయి బలప్రదర్శన పోటీలు

శ్రీకాకుళం : శ్రీకాకుళం గ్రామీణ మండలం పెద్దపాడులో ఈ నెల 18న జిల్లా స్థాయి బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పి.ధనంజయకుమార్, ఐ.అప్పన్న, ఐ.సింహాచలం, అప్పలసూరమ్మలు ఒక ప్రకటనలో తెలిపారు. రెయ్యమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా పురుషులు, మహిళల వెయిట్ లిఫ్టింగ్, సంగిడి పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

## ఉన్నత లక్ష్యాలతో విజయాలు



కవిటి : విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని కఠోర సాధనతో విజయాలు సొంతం చేసుకోవాలని వక్తలు కోరారు. శవసానపుట్టుగ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు జగదీష్ మాట్లాడుతూ ఒత్తిడిని అధిగమించేలా విద్యార్థులకు మార్గనిర్దేశనం చేస్తున్న తమకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. గ్రామానికి చెందిన కె.చంద్రశేఖర్ బీరువాను బహుకరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

## అంగరంగ వైభవంగా వెలుగుల రేడు కల్యాణం



అరసవల్లి : లోకానికి వెలుగులనిచ్చే వెలుగుల రేడు పరిణయమాడారు. ఉషాపద్మినీచ్ఛాయ సమేత సూర్యనారాయణస్వామి పెళ్లికొడుకయ్యారు. వేదమంత్రోచ్చారణలు, భక్తుల మధ్య ఉషాపద్మినీచ్ఛాయదేవిలను వివాహమాడారు. ఆదిత్యుడి వార్షిక కల్యాణం అత్యంత వేడుకగా జరిగింది. పూల అలంకరణలో స్వామివారు భక్తులకు కనువిందు చేశారు. ఓం నమో భగవతే సూర్యాయ అన్న నామస్మరణలో భక్తులు నిమగ్నమయ్యారు. అరసవల్లి సూర్యనారాయణస్వామి వారికి చైత్రశుద్ధ ఏకాదశి సందర్భంగా వార్షిక కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఆదిత్యుడికి వెండి అశ్వవాహనంపై తిరువీధి మహోత్సవం, నాలుగు మాఢవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

అనంతరం ఆలయ అనివెట్టి మండపంలో ఉషాపద్మినీచ్ఛాయ సమేత సూర్య నారాయణస్వామి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా పరిణయం జరిపారు. దేవేరులను కమనీయంగా అలంకరించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షబంధనం, యజ్ఞోపవీతధారణ, కనిక రధసూత్రం, గౌరిపూజ, మంగాళ్యధారణ, తలంబ్రాలు, మహ నీరాజనం, మంత్రపుష్పం, ప్రవేశహోమాదులు నిర్వహిం చారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈవో ఆర్.పుష్ప నాధం, తదితరులు పాల్గొన్నారు.

## పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల : ఎచ్చెర్ల అంబేడ్కర్ విశ్వవిద్యాలయం దాని అనుబంధ పీజీ కళాశాలల విద్యార్థులకు వర్సిటీ కేంద్రంగా సోమవారం నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. రెండో సెమిస్టర్ నేటి ప్రారంభమవుతాయని వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ సమన్వయకర్త డా.బిడ్డికి అడ్డయ్య మాట్లాడుతూ ఆర్ట్స్ కోర్సులకు సంబంధించి రెండో సెమిస్టర్‌కు 341, నాలుగో సెమిస్టర్‌కు 466, సైన్స్ కోర్సులకు సంబంధించి రెండో సెమిస్టర్‌కు 469, నాలుగో సెమిస్టర్‌కు 441 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

# అగ్ని ప్రమాదాలపై అవగాహన

కాకినాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో కాకినాడ ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా అగ్నిమాపక అధికారి ఎం. రాజా ఆధ్యంలో రైల్వేస్టేషన్, బస్‌స్టాండ్, బర్మాకాలని, సర్పవరం ఎస్ఆర్ఎంటి అపార్టు మెంట్ సమూహంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలు, మెలుకువలు, నివారణా చర్యలు పై మహిళలు, పిల్లఉ ,పెద్దలకు వివరించారు.ముఖ్యంగా వంటగదిలో మహిళలు తీసుకోవలసిన రక్షణ చర్యలు, వంట గ్యాస్ వినియోగంలో తీసుకోవల సిన జాగ్రత్తలు, విద్యుత్ ప్రమాదాలు సంభవించినచో ఫైర్‌ఎక్స్‌టింగిషర్ల సహాయముతో ఏవిధంగా ప్రమాదాలు నివారించ వచ్చునో ప్రయోగాత్మకంగా వివరించారు. గోడపత్రికలు వేసి ,కరపత్రాలుపంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# దాసరి సేవలు మరువలేనివి



ములగాడ: మల్కాపురం 48 వ వార్డు ప్రకాష్ నగర్ వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు మాజీ కార్పొరేటర్ దాసరి ఈశ్వరరావు 64వ జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు అక్కడ ఏర్పాటు చేసిన చలివేంద్ర కార్యక్రమాన్ని వైఎస్ఆర్సిపి నాయకులు చేతుల మీదగా ప్రారంభించారు.

అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ దాసరి ఈశ్వరరావు కాంగ్రెస్ పార్టీ హయాంలో ఎన్నో పదవులు చేపట్టి ప్రజలకు ఎన్నో సేవలు అందించాలని ఆయన సేవలో ఎప్పుడూ మరువలేనివని స్థానిక ప్రజలకు అన్యాయం జరిగింది.

అంటే న్యాయం జరిగే వరకు పోరాడే వ్యక్తి ఈశ్వర్ రావు అని ఆయన మనల్ని విడిచి వెళ్ళిపోయినా ఆయన జ్ఞాపకాలు ఎప్పుడూ ప్రజల్లో ఉంటాయని అన్నారు ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు 48 వార్డు అధ్యక్షులు వాసు పిలక రామ్మోహన్రెడ్డి బద్రీనాథ్ మరియాదాస్ దాసరి రవి పిల్లా కన్నబాబు పిలా అనంత్ చట్టి నూకరాజు అధిక శాతంలో వైఎస్ఆర్సిపి నాయకులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



**భీమునిపట్నం మంగళవారం తగరపువలస వాస్తవ్యులు కీ. శే. శీరపు సత్తియ్యమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు శీరపు రాజారావు , వెంకటరెడ్డి , గోవిందరావు ఏర్పాటు చేసిన భోజనము మిగిలినది ఆ భోజనమును డి. సి. ఆర్. సేవారథం ద్వారా కరుణ నిలయం అనాధాశ్రమం పిల్లలకు అందజేయడం జరిగినది ఈ కార్యక్రమం లో సుశీల్ రావు వెంపాడ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.**

# వర్సిటీలో పురాతనమైనది తెలుగు శాఖ



ఆంధ్రవిశ్వవిద్యాలయం : భాషా ప్రాతిపదికన ఏర్పాటైన ఆంధ్రవిశ్వవిద్యాలయంలో తొలుత ఏర్పాటు చేసిన శాఖగా తెలుగు శాఖ పురాతనమైనదని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. సాయంత్రం తెలుగు శాఖ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన 116 మంచి కవులు రచనల సంపుటి ఆది నుంచి అనంతం వరకు పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఇటువంటి పుస్తకాలను వర్సిటీలో ఆవిష్కరించడం వర్సిటీకి గర్వకారణమన్నారు.

కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు, ఆచార్య ఎం.దత్తాత్రేయ శాస్త్రి, పుస్తక రూపకర్త చివుకుల శ్రీలక్ష్మి, కె.శ్రీనివాస రావు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కవులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యసాయి విద్యా విహార్ నందు

# వైభవంగా యుకెజీ స్నాతకోత్సవాలు



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్థానిక శ్రీ సత్యసాయి విద్యా విహార్ నందు ప్రతీ అంశాన్ని సరికొత్త కార్యక్రమం ద్వారా ముందుకు తీసుకొని వెళుతున్న ఆంగ్ల మాధ్యమ పాఠశాల వారు యుకేజీ స్నాతకోత్సవ వేడుగలను వినూత్నముగా రూపొందించి ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రాఘవేంద్ర రెసిడెన్సీ నందు మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. శ్రీ సత్యసాయి సేవాసమితి ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ చిట్టిబాబు మాట్లాడుతూ చిన్నారులకు సందేశాన్ని ఇస్తూ వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ చాలా ముఖ్యమైనది అని పిల్లల మనోగతానికి మానసిక వికాశానికి క్రమశిక్షణ, శ్రద్ధ,పట్టుదల,సామాజిక అంశాలు దృఢపడే సమయమని విద్యార్థి దశను అభివర్ణించారు. మరోక ముఖ్య అతిధిగా విచ్చేసిన ఇంటెలిజెన్స్ సబ్ ఇన్ స్పెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ చిన్నారులకు క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని అభివర్ణించారు. ఇటువంటి కార్యక్రమాలు చిన్నారుల మనోభివృద్ధికి తోడ్పడతాయని సందేశాన్ని ఇచ్చారు. వీరితో పాటు సత్యదేవ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ డొంకాడ.గిరి, పాఠశాల అధినేత జి.హరిప్రసాద్ మరియు ప్రధానోపాధ్యాయుడు టి.శివకుమార్ తమ అమూల్యమైన సందేశాన్ని చిన్నారులకు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి ఉపశమనం



మధురవాడ : మధురవాడ పరిసర ప్రాంతాల్లో అంచెలంచెలుగా పెరుగుతున్నట్రాఫిక్ తో పాటు చాలీచాలని రహదారులతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలందరినీ ఈ ట్రాఫిక్ కష్టాల నుండి కొంతమేరకు ఉపశమనం కలిగించే విధంగా పీఎం పాలెం ట్రాఫిక్ విభాగం చర్యలు చేపట్టన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయల సమావేశం ట్రాఫిక్ సిఐ తెలిపిన వివరాల మేరకు ప్రస్తుతం ప్రజలు ఉపయోగిస్తున్న కార్ షెడ్ కూడలి నుండి తగరపువలస, విజయనగరం ప్రాంతాల వైపు వెళ్లే వారు సాయి ప్రియా గార్డెన్స్, బక్కన్నపాలెం వెళ్లేందుకు వీలుగా జాతీయ రహదారి నుండి చంద్రంపాలెం అమ్మవారి దేవాలయాల వద్ద ఏ విధమైన కటింగ్ ఏర్పాటు చేశారో, ప్రస్తుతం అదే విధమైన కటింగ్ ను విజయనగరం, తగరపువలస నుండి సిటీ వైపు వెళుతున్న వాహనదారులు కు వీలుగా చంద్రంపాలెం బజాజ్ షోరూమ్ దగ్గర ఒక కటింగ్ ఏర్పాటు చేసి ఇటు వాంబే కాలనీ, నగరంపాలెం, చంద్రంపాలెం, వుడా కాలనీ వెళ్లేందుకు వీలుగా, అదేవిధంగా బక్కన్నపాలెం ప్రాంతం మీదుగా సిటీ ప్రాంతానికి వెళ్లదలచిన వాళ్ళు నేరుగా ఈ కటింగ్ ను ఉపయోగించుకొని జాతీయ రహదారి మీదుగా వెళ్లేందుకు వీలుగా ట్రాఫిక్ విభాగం, జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం, జాతీయ రహదారుల సంస్థ సంయుక్తంగా కలిసి ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని పీఎం పాలెం ట్రాఫిక్ విభాగం సీఐ ఆర్ వి వి ఎస్ ఎస్ చంద్రశేఖర రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎం పాలెం ట్రాఫిక్ ఎస్ఐ నర్సింగ్ రావు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలకు ఎంపిక





అచ్యుతాపురం : మండలంలో కొండకర్ల ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ ఎం రొంగలి రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతికి ఎంపికైనందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు .ఎంపికైన విద్యార్థులు గుడివాడ దీపక్ ,వళ్ళు శిరీష లను హెచ్ ఎం తో పాటు ఉపాధ్యాయులు టి ఏ సత్యనారయణ ,వి హెచ్ నళిని ,మారిశెట్టి వెంకటప్పారావు ,కె సోమశేఖర్ ,అద్దేపల్లి విజయ్ అభినందించారు.

# పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి




కాకినాడః జిల్లాలో రెవెన్యూ, పౌర సరఫరాలు ఇతర శాఖలకు సంబంధించి 30 వేల ఫిర్యాదులు పెండింగ్ లో వున్నాయని వాటన్నిటిని సత్వరం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎ.మల్లిఖార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు.

మంగళవారం కాకినాడ జాయింట్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి సబ్ కలక్టర్లు, ఆర్డిఓలు తహశిల్దార్లు, పౌరసరఫరాశాఖాధికారులు, భూసర్వేశాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భం గా జాయింట్ కలక్టరు మల్లిఖార్జున మాట్లాడుతూ గత రెండు నెలలుగా వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులలో నిమగ్నమై ఉన్నందున వచ్చిన ఫిర్యాదులు పెండింగ్ లో ఉన్నాయని వాటిని త్వరిత గతిన పరిష్కరిం చాలన్నారు.

రాజమహేంద్ర వరం ఎనిమిది మండలాలకు సంబంధించి రెవెన్యూ, సివిల్ సప్లయిస్ శాఖలకు 8290 ఫిర్యాదులు వచ్చాయని వాటిని వెంటనే పరిష్కరించాలని జాయింట్ కలక్టర్ సూచించారు. సివిల్ సప్లయిస్ కి సంబంధించి రేషన్ కార్డుల్లో మెంబర్ ఎడిషన్ , డిలీషన్స్, మోడిఫికేషన్స్ ఉన్నాయని అవన్నీ యాక్టివేట్ చేయాలన్నారు. వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జాప్యం ఉండకూడదన్నారు. తహశీల్దార్లు గైడ్ లైన్స్ ప్రకారం సక్రమంగా ఫిర్యాదులను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. డాక్యుమెంటేషన్ పెండింగ్, లేకుండా పరిష్కరించాలని ఆయన తెలిపారు. పెద్దాపురం డివిజన్ కు సంబంధించి తునిలో ఫిర్యాదులు ఎక్కువ పెండెన్సీ ఉందని, అదే విధంగా కిర్లంపూడిలో ఫిర్యాదులు తక్కువ పెండెన్సీ ఉందని, తహశీల్దార్లు ఫిర్యాదులు పరిష్కారంనకు తగు చర్యలు చేపట్టాలన్నారు. విఆర్ఓలు ఇన్ స్పెక్షన్ చేసి ఒక వారం రోజులు ఫిర్యాదులన్నీ పరిష్కరించాలని చెప్పారు. తహశీల్దారు కార్యాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభించిన వాటిని సత్వరం పూర్తి చేయుటకు సంబంధిత ఇంజనీర్లు, కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు ప్రగతి చూపించాలన్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో కుల ధృవీకరణ పత్రాలు ప్రభుత్వ గైడ్ లైన్స్ ప్రకారం తహశీల్దార్లు వెరిఫికేషన్ చేసి ఇవ్వాలని జాయింట్ కలక్టరు ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జేసీ-2 సి హెచ్.సత్తిబాబు, డిఆర్ ఓ యం.వి.గోవిందరాజులు, సబ్ కలక్టర్లు, ఆర్ డిఓలు, తహశీల్దార్లు, ఎడి సర్వే నూతన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# జీవకోటికి ప్రాణాధారం జలం



ములగాడ: సమస్త జీవకోటికి ప్రాణాధారం జలం అని అందుకే నీటిని వృధా చేయరాదు ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ ప్రతినిధి యు ఎస్ రమేష్ అన్నారు స్థానిక ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ క్యాంపులో కార్యక్రమంలో మంగళవారం సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన నీటి వనరులు నిర్వహణ సదస్సును ప్రారంభించారు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలోనూ పారిశ్రామిక రంగంలోనూ అభివృద్ధి చెందుతుందని నీటి వనరులతో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు ముడిపడి ఉన్నాయని ఆయన అన్నారు ఇదేవిధంగా ఎకనామిక్ కోఆర్డినేటర్ డాక్టర్ బి వి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడాలి అని భూగర్భ జలాలను పెంచాలని ఆయన అన్నారు అనంతరం నీటి వనరుల పొదుపు సదస్సుపై బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు ఈ కార్యక్రమంలో ఆకెళ్ల వెంకటరమణ మూర్తి జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ పి ఎస్ భాగ్యలక్ష్మి క్యాంప్ డైరెక్టర్ ఆచార్య నిరంజన్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

# సైన్యానికి ఎమర్జెన్సీ అధికారాలు!



న్యూఢిల్లీ : జమ్మూ-కశ్మీరులోని పుల్వామాలో ఫిబ్రవరి 14న సీఆర్‌పీఎఫ్ వాహన శ్రేణిపై ఉగ్రవాద దాడి జరిగిన నేపథ్యంలో త్రివిధ దళాలకు అత్యవసర అధికారాలు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఆయుధాల వ్యవస్థలను సమకూర్చుకునేందుకు ఈ అధికారాలను కల్పించినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌తో సరిహద్దులను పరిక్షించేందుకు అవసరమైన అన్ని రకాల ఆయుధాలను సమకూర్చుకునేందుకు ఈ అధికారాలు ఉపయోగపడతాయి. ఒక్కో విభాగంలో రూ.300 కోట్ల వరకు వ్యయం చేయడానికి, మూడు నెలల్లోగా త్రివిధ దళాలకు అవసరమైన ఆయుధాలను కొనడానికి వీలవుతుంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ నుంచి 250 స్పైక్ మిసైల్స్‌ను కొనడానికి సైన్యం ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా వాయు సేన కూడా కొన్ని ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. వీటిని కొనడానికి రక్షణ మంత్రిత్వ శాఖలోని ఆర్థిక శాఖలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ అడ్వయిజర్ సమ్మతిని పొందవలసిన అవసరం లేదు.పుల్వామా దాడిలో 44 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది అమరులైన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటన జరిగిన కొద్ది వారాలకే కేంద్ర ప్రభుత్వం ఈ అత్యవసర అధికారాలను త్రివిధ దళాలకు ఇచ్చిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పుల్వామా దాడి అనంతరం పాకిస్థాన్ సరిహద్దుల్లో భారత దేశం గట్టి నిఘా పెట్టింది.

# చేతులెత్తేసిన బ్యాంకులు?

## -సాయంపై ఇంకా నిర్ణయం తీసుకోని రుణదాతలు
## -అయోమయంలో వేలాది జెట్ ఉద్యోగులు
## -నేడు బోర్డు కీలక సమావేశం



ముంబై: జెట్ ఎయిర్‌వేస్‌కు గట్టి ఎదురుదెబ్బ. పునరుద్ధరణకున్న దారులన్నీ మూసుకుపోతున్నాయి. మధ్యంతర సాయం చేస్తామన్న బ్యాంకులూ.. చేతులెత్తేసినట్లే కనిపిస్తున్నది. రూ.1,500 కోట్ల తక్షణ సాయం చేస్తామని సంస్థకు రుణాలిచ్చిన బ్యాంకర్ల కూటమి గత నెల హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే రోజులు గడుస్తున్నా ఈ సా యం ఆచరణలోకి రాకపోవడంతో సోమవారం బ్యాంకర్లను కలిసిన జెట్ నిర్వాహకులకు నిరాశే మిగిలింది. నిధులను అందించడంపై రుణదాతలు ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. మంగళవారం జెట్ ఎయిర్‌వేస్ బోర్డు సమావేశం జరుగుతుండటం.. ఈ అనుమానాలకు మరింతగా తావిస్తున్నది.

**ఏం చేయాలో నిర్ణయిస్తాం: దూబే**

బోర్డు సమావేశం అనంతరం తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని జెట్ సీఈవో వినయ్ దూబే సోమవారం ఇక్కడ చెప్పారు. బోర్డు నుంచి మార్గదర్శకాలను మేనేజ్‌మెంట్ తీసుకుంటుందని వివరించారు. సోమవారం భేటీలో రూ.1,500 కోట్ల సాయంపై బ్యాంకర్లు ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. అత్యవసరాల కోసం దాదాపు రూ.250 కోట్లను బ్యాంకులు విడుదల చేశాయన్నారు. కాగా, బోర్డు నిర్ణయాలను ఉద్యోగులకు తెలియపరుస్తామని, మరే కీలక నిర్ణయాలు తీసుకున్నా.. ఎప్పటికప్పుడు వెల్లడిస్తామన్నారు.

**చేస్తామన్న సాయం చేయండి**

మరోవైపు రూ.1,500 కోట్లను విడుదల చేయాలని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐని నాగ్ కోరింది. గత నెల జెట్ ఎయిర్‌వేస్ యాజమాన్యం చేతులు మారిన నేపథ్యంలో మెజారిటీ వాటాదారులుగా ఉన్న బ్యాంకులు రూ.1,500 కోట్ల సాయం చేస్తామని గత నెల హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. తక్షణ అవసరాల నిమిత్తం ఈ నిధుల్ని అందిస్తామని చెప్పాయి.

త్వరలోనే బిడ్డర్లను ప్రకటిస్తాం: ఎస్‌బీఐ

జెట్ ఎయిర్‌వేస్‌లో ఉన్న తమ వాటాను అమ్మడానికిగాను నిర్వహించిన బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొన్న వారి పేర్లను త్వరలోనే ప్రకటిస్తామని ఎస్‌బీఐ తెలిపింది. ఎస్‌బీఐ నేతృత్వంలోని రుణ దాతలకు సంస్థలో మెజారిటీ వాటా ఉన్న విషయం తెలిసిందే. ఎస్‌బీఐ క్యాపిటల్ ఈ బిడ్డింగ్ ప్రక్రియ మొత్తాన్ని




పర్యవేక్షిస్తున్నదని ఈ సందర్భంగా ఎస్‌బీఐ తెలియజేసింది. మరోవైపు జెట్ ఎయిర్‌వేస్ కోసం అమెరికా, బ్రిటన్ సంస్థలతో కలిసి నరేశ్ గోయల్ బిడ్డింగ్‌లో పాల్గొన్నట్లు తెలుస్తున్నది. ఎతిహాద్ ఎయిర్‌వేస్ కూడా రేసులో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం సంస్థకు రుణాలిచ్చిన బ్యాంకులకు 51 శాతం వాటా ఉండగా, గోయల్ దంపతులకు 24 శాతం, ఎతిహాద్‌కు 12 శాతం వాటాలున్నాయి. 13 శాతం ఇతర్రతా వాటాదారులకున్నది.

**ఆదుకోవాలని ప్రధానికి సిబ్బంది విజ్ఞప్తి**


జెట్ ఎయిర్‌వేస్ సంక్షోభం రోజురోజుకూ ముదురుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభు త్వం జోక్యం చేసుకోవాలని సంస్థ ఉద్యోగులు కోరుతున్నారు. ఇందులో భాగంగానే సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి తమను ఆదుకోవాలంటూ విజ్ఞప్తి చేశారు. జెట్ ఎయిర్‌వేస్ పైలెట్ల సంఘం నేషనల్ ఏవియేటర్స్ గిల్డ్ (నాగ్) ఉపాధ్యక్షుడు అదిమ్ వలియాని ఇక్కడి సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద విలేఖరులతో మాట్లాడుతూ 20 వేల మంది ఉద్యోగుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ ఇబ్బందులపై దృష్టి పెట్టాలని, తమకు న్యాయం చేయాలని ప్రధానిని కూడా కోరినట్లు తెలిపారు.

**18దాకా అంతర్జాతీయ సర్వీసుల్లేవ్**

బ్యాంకుల నుంచి సాయం రాని నేపథ్యంలో జెట్ ఎయిర్‌వేస్ అంతర్జాతీయ విమాన సర్వీసుల రద్దు పొడిగించబడింది. ఈ నెల 18దాకా అంతర్జాతీయ సర్వీసులను నిలిపివేస్తున్నట్లు జెట్ ఎయిర్‌వేస్ సోమవారం ప్రకటించింది. నిజానికి సోమవారం వరకే వాయిదా వేస్తున్నట్లు జెట్ గతంలో చెప్పింది. అయితే తాజాగా మరో మూడు రోజులు పొడిగిస్తూ విదేశీ విమాన సర్వీసులను గురువారం వరకు ఆపేస్తున్నామని సంస్థ సీఈవో దూబే స్పష్టం చేశారు. జెట్ ఎయిర్‌వేస్ తమ సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు ఇవ్వని విషయం తెలిసిందే. జనవరి, ఫిబ్రవరి జీతాలతోపాటు మార్చి జీతాన్నీ ఇంతవరకు ఉద్యోగులకు అందించలేదు. రూ.8,000 కోట్లకుపైగా రుణ భారాన్ని మోస్తున్న జెట్ ఎయిర్‌వేస్.. ఒకప్పుడు గరిష్ఠంగా 124 విమానాలను నడిపింది. ఇప్పుడు 6 విమానాలకు పడిపోయింది. ఈ నెల 13 నుంచి జెట్ విదేశీ విమానాలు రైద్దెపోగా, దేశీయంగా రోజుకు 50 సర్వీసులు కూడా తిరుగడం లేదు.

# జలాశయాల్లో తగ్గుతున్న నీటి నిల్వలు..!

**ఎండాకాలం గడిచేది ఎలా..?**



ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతోంది. ఎండ తీవ్రత పెరుగుతుండటం భయాందోళనలకు గురిచేస్తోంది. ఇంకా రోహిణి కార్తె రాలేదు. అప్పుడే భానుడి భగభగలు తెలుగు రాష్ట్రాల ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయి. ఎండ తీవ్రతకు తట్టుకోలేని ప్రజలు, ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఈ సీజన్ లో హైదరాబాద్ లో తొలిసారిగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తీవ్రమైన ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కరెంట్ కు డిమాండ్ పెరిగింది. దాహార్తిని తీర్చుకునేందుకు ప్రజలు శీతల పానియాలు తీసుకుంటూ సేదతీరుతున్నారు.

## ఆ ఆలయంలో మహిళలకు ప్రవేశం ఉన్నప్పుడు మసీదులో ఎందుకు ఉండకూడదు

ఢిల్లీ: ముస్లిం మహిళలు మసీదుల్లోకి ప్రవేశింపరాదని మతపరంగా ఎక్కడైనా ప్రస్తావించారా అని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. మహిళలు మసీదులో ప్రవేశించి నమాజ్ చేసేలా అనుమతి కల్పించాలంటూ దాఖలైన పిల్‌ను అత్యున్నతం న్యాయంస్థానం విచారణ చేసింది. ప్రార్థన ఆలయాల్లోకి ప్రవేశించాలంటే ఒకరి అనుమతి తీసుకోవాలా..? మహిళలను మసీదులోకి అనుమతించకపోవడం రాజ్యాంగ ఉల్లంఘన కిందకు వస్తుందని సుప్రీంకోర్టు తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14,15,21,25,29లను ఉల్లంఘించినట్లు అవుతుందని కోర్టు తెలిపింది. దీనిపై స్పందన తెలియజేయాలంటూ కోరుతూ కేంద్ర ప్రభుత్వం, వక్ఫ్‌బోర్డు, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. మహిళలను మసీదులోకి ప్రవేశం కల్పించాలని కోరుతూ సుప్రీం కోర్టులో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం పిల్‌ను మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేసింది. జస్టిస్ ఎస్ఏ బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిల్‌ను విచారణ చేసింది. ఈ సందర్భంగా శబరిమల ఆలయంలోకి మహిళలకు ప్రవేశం కల్పిస్తూ ఇచ్చిన తీర్పును ధర్మాసనం ప్రస్తావించింది. మసీదులోకి, ఆలయంలోకి, చర్చిలోకి ప్రవేశించాలంటే ఒకరి అనుమతి ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించింది. ఇక్కడే రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయని పేర్కొంది. ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుంది ఈ పిల్‌ను ముస్లిం సామాజిక వర్గానికి చెందిన యస్మీన్, జుబేర్ దంపతులు దాఖలు చేశారు.మసీదుకి మహిళలకు ప్రవేశం కల్పించి నమాజ్‌లో పాల్గొనేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అంతేకాదు ఇలా మహిళలను మసీదులోకి అనుమతించకపోవడమంటే రాజ్యాంగం ప్రసాదించిన హక్కును ఉల్లంఘించినట్లు అవుతుందని పిల్‌లో పేర్కొన్నారు. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్‌లో కూడా మహిళలను మసీదుల్లోకి అనుమతించకూడదని ఎక్కడా పేర్కొనబడలేదని తెలిపారు. ఇది మహిళల మనోభావాలను కించపరచడమే కాదు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడం కూడా అవుతుందని వారి తరుపున లాయర్ అశుతోష్ దూబే అన్నారు. మహిళలకు పురుషులకు సమాన హక్కులు కలిగి ఉన్నారని అశుతోష్ దూబే అన్నారు. శబరిమల ఆలయం పై ఇచ్చిన తీర్పును ప్రస్తావించిన సుప్రీం కోర్టు ప్రస్తుతం జమాత్-ఈ-ఇస్లామి మరియు ముజాహిద్ సెక్ట్‌కు చెందిన మహిళలకు మాత్రమే మసీదులో నమాజ్ చేసే అవకాశం కల్పిస్తున్నారు. అయితే సున్నీ వర్గం వీరు నమాజ్ చేసేందుకు అనుమతి నిరాకరిస్తూ నిర్ణయం తీసుకుంది. అంతేకాదు ఒకవేళ మహిళలను మసీదుల్లోకి అనుమతించినప్పటికీ పురుషులకు మహిళలకు వేర్వేరు ప్రవేశద్వారాలు పెడుతున్నారని పిల్‌లో పేర్కొన్నారు.

# దీపికలా కనిపించాలన్నారు!



ప్రస్తుతం వృత్తిపరంగా ఉన్న పోటీని తట్టుకోవాలంటే పాత్రలపరంగా సవాళ్లకు సిద్ధపడాలని భావిస్తున్నారు కథానాయికలు. పాత్రలకోసం ఎలాంటి ప్రయోగాలకైనా రెడీ అంటున్నారు. తాజాగా పంజాబీ సుందరి రకుల్‌ప్రీత్‌సింగ్ దే దే ప్యార్ దే చిత్రం కోసం పదికిలోల బరువు తగ్గిందట. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఇటీవలే విడుదల చేసిన ఈ సినిమా గీతం అందరి దృష్టిని ఆకట్టుకుంది. చూపుమరల్చుకోలేని అందచందాలతో నాయిక రకుల్‌ప్రీత్‌సింగ్ కుర్రకారుని ఫిదా చేసింది. ముఖ్యంగా ఆమె స్లిమ్‌లుక్ గురించి అందరూ చర్చించుకున్నారు. ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొన్న రకుల్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ చిత్ర దర్శకుడు లవ్‌రంజన్ ఈ సినిమా కోసం నన్ను చాలా సన్నబడాలని కోరారు. మామూలుగా నేను చక్కటి ఫిట్‌నెస్‌ను మెయిన్‌టెయిన్ చేస్తాను.

అయితే పాత్రపరంగా ఇంకా బరువు తగ్గాలని సూచించారు. కాక్‌టెయిల్ సినిమాలో దీపికాపదుకునే మాదిరిగా కనిపించాలని చెప్పారు. ఆయన మాటల్ని ఛాలెంజ్‌గా తీసుకున్నాను. జిహ్వాచాపల్యాన్ని అదుపులో ఉంచుకుంటూ చక్కటి డైట్‌తో పదికిలోల బరువు తగ్గాను. నాజూకు సోయగంతో స్క్రీన్‌పై నన్ను నేను చూసుకొని ఎంతగానో మురిసిపోయాను అని చెప్పింది రకుల్‌ప్రీత్‌సింగ్. దే దే ప్యార్ దే చిత్రంలో అజయ్‌దేవ్‌గణ్, టబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. లండన్ నుంచి వచ్చిన అమ్మాయి పాత్రలో రకుల్‌ప్రీత్‌సింగ్ నటిస్తున్నారు. మే 17న ప్రేక్షకులముందుకురానుంది.

# చిత్రభాను

# అనుబంధాలకు దర్పణం



జీవితంలో ఎలాంటి ఒడిదుడుకులు వచ్చినా అనుకున్న లక్ష్యం సాధించడానికి కృషితో ముందుకు వెళ్లాలని చిత్రలహరిలో ఆవిష్కరించిన తీరు బాగుంది. తండ్రీకొడుకుల అనుబంధం గురించి చక్కగా చూపించారు అని అన్నారు ప్రముఖ నటుడు చిరంజీవి. సాయితేజ్ కథానాయకుడిగా నటించిన చిత్రం చిత్రలహరి. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, చెరుకూరి మోహన్(సి.వి.ఎం) నిర్మించారు. కిషోర్ తిరుమల దర్శకుడు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. చిరంజీవి చిత్రబృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్థవంతమైన సందేశంతో దర్శకుడు కిషోర్ తిరుమల సినిమాను తెరకెక్కించారు. నటుడిగా తేజు తన ప్రతిభను నిరూపించుకున్నాడు. పరిణితితో కూడిన అభినయాన్ని కనబరిచాడు. పోసాని కృష్ణమురళి, సునీల్‌తో పాటు ఇతర నటీనటులు తమ పాత్రల్లో చక్కగా ఒదిగిపోయి సినిమాకు నిండుదనం తెచ్చారు. దేవిశ్రీప్రసాద్ అద్భుతమైన సంగీతాన్ని అందించాడు. విజయవంతమైన చిత్రాలకు మైత్రీ మూవీస్ చిరునామాగా నిలుస్తున్నది. వారి ప్రతిష్టను మరింత నిలబెట్టుకునేలా సినిమాను రూపొందించారు. అనుబంధాలను హృద్యంగా ఈ సినిమాలో ఆవిష్కృతం చేశారు. వేసవిలో ప్రతి ఒక్కరూ చూడదగ్గ సినిమా ఇది అని తెలిపారు.

**కేరళలో సైరా**

సీనియర్ నటుడు చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం సైరా నరసింహారెడ్డి. సురేందర్‌రెడ్డి దర్శకుడు. కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. ఆంగ్లేయులను ఎదిరించిన తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నయనతార, తమన్నా కథానాయికలు. బాలీవుడ్ బిగ్ బి అమితాబ్‌బచ్చన్, సుదీప్, విజయ్‌సేతుపతి, జగపతిబాబు ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. అన్ని భాషల అగ్రనటులు భాగం కావడంతో పాన్ ఇండియా మూవీగా ఇప్పటికే అందరి దృష్టిని ఆకట్టుకుంటుందీ చిత్రం. ప్రస్తుతం కేరళలోని చాలకూడిలో చిత్రీకరణ జరుగుతున్నది. చిరంజీవి, జగపతిబాబు పాత్రలపై కీలక ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు.

ఈ చిత్రంలో పోరాటయోధుడు వీరారెడ్డిగా జగపతిబాబు ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నారు. నరసింహారెడ్డి రాజగురువు గోసాయి వెంకన్న పాత్రలో అమితాబ్‌బచ్చన్ అతిథి పాత్రలో కనిపించనున్నారు. మే నెలాఖరులోగా చిత్రీకరణ పూర్తిచేసే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్లు సమాచారం. అమిత్‌త్రివేది స్వరకర్త. ఈ ఏడాది ద్వితీయార్థంలో ప్రేక్షకులముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# జెర్సీ.. ఆర్ యు రెడీ..!




నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించిన జెర్సీ చిత్రానికి క్లీన్ యు సర్టిఫికేట్ లభించింది. ఈ విషయాన్ని నాని సోషల్‌మీడియా ద్వారా వెల్లడిస్తూ ఆర్ యు రెడీ? అని క్యాప్షన్ ఇచ్చారు. ఓ చిన్న పిల్లాడితో సరదాగా మాట్లాడు కుంటు న్నట్లుగా ఉన్న కొత్త పోస్టర్‌ను అభిమానులతో పంచుకున్నారు. గౌతమ్ తిన్ననూరి సినిమాకు దర్శకత్వం వహించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సినిమా ప్రీరిలీజ్ వేడుక అట్టహాసంగా జరిగింది. వేడుకకు సినీ నటుడు విక్టరీ వెంకటేశ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.

ఆయనతో కలిసి చిత్రబృందం సరదాగా క్రికెట్ కూడా ఆడింది. ఇందులో నాని అర్జున్ అనే క్రికెటర్ పాత్రలో నటించారు. 1990ల కాలం నేపథ్యంలో సినిమాను తెరకెక్కించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ చిత్రం ఏప్రిల్ 19న విడుదల కానుంది.

# అర్జున్ సరసన

*ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఆర్ఆర్ఆర్ తో తెలుగు చిత్రసీమలో ఎంట్రీ ఇస్తున్నది బాలీవుడ్ సొగసరి అలియాభట్. తాజాగా తెలుగులో ఆమె మరో సినిమాను అంగీకరించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.*





**వైకాపా అధినేత జగన్‌ను కలిసిన ముత్తంశెట్టి**

మంగళవారం ఉదయం లోటస్ పాండ్ నందు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని భీమిలి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిసి ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రేమ వేధింపులకు ఆరిన జ్యోతి!



కేపీహెచ్‌బీ కాలనీ: ప్రేమ పేరుతో వేధింపులు తాళలేక విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటన హైదరాబాద్ కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, యువతి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కొహెడ మండలానికి చెందిన సిద్దిరాల జ్యోతి (24) కేపీహెచ్‌బీ ఫేజ్-4లో గత కొంతకాలంగా నివాసం ఉంటోంది. ఆమె బేగంపేట్ ప్రకాశ్‌నగర్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తుంది. రెండేళ్ల క్రితం స్వగ్రామంలో ఉన్న సమయంలో రాకేశ్‌రెడ్డి అనే యువకుడు జ్యోతిని ప్రేమించాలంటూ వెంటపడి వేధించేవాడు. ఈ విషయం తెలిసిన యువతి తండ్రి లక్ష్మణ్.. రాకేశ్ రెడ్డిని మందలించాడు. ఆ తర్వాత జ్యోతి కేపీహెచ్‌బీలోని ఫేజ్-4కు వచ్చి నివాసముంటోంది. ఈ క్రమంలో నగరంలోని ఓ ప్రైవేట్ ఇంటర్‌నెట్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్న రాకేశ్‌రెడ్డి ఇక్కడ కూడా యువతిని వేధించసాగాడు. సోమవారం రాత్రి 7:30 గంటలకు కేపీహెచ్‌బీ 9వ ఫేజ్‌లోని పార్కులో వారిద్దరూ కలిశారు. రాత్రి 9గంటల సమయంలో రాకేశ్‌రెడ్డి జ్యోతి సెల్‌ఫోన్ నుంచి ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ అమ్మాయి విషం తాగిందంటూ సమాచారం ఇచ్చాడు. అనంతరం అతనే యువతిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించాడు. సుమారు 12గంటల పాటు చికిత్సపొందిన జ్యోతి ప్రాణాలు కోల్పోయింది. దీంతో యువతి తల్లిదండ్రులు బోరున విలపించారు. రాకేశ్‌రెడ్డి వేధింపుల వలనే తమ కూతురు విషం తాగి ఆత్మహత్యకు పాల్పడిందని యువతి తండ్రి లక్ష్మణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

రాకేశ్ బలవంతం చేసి బాధితురాలిచేత విషం తాగించాడా? నిన్న రాత్రి వాళ్లిద్దరూ ఎందుకు కలుసుకున్నారు? ఆత్మహత్యాయత్నానికి దారితీసిన పరిస్థితులేంటి? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# కార్యకర్తల కృషి అభినందనీయం

## కృతజ్ఞతా సమావేశంలో కె కె రాజు



విశాఖ సిటీః ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా పార్టీ కోసం పనిచేసిన ప్రతీ కార్యకర్తకు ఉత్తర నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె.కె.రాజు కృతజ్ఞతలు తెలిపారు.

మంగళవారం సీతమ్మధార కె యెస్ ఆర్ ఫంక్షన్ హాల్లో ఉత్తర నియోజకవర్గంలో గల బూత్ కన్వీనర్లు, ముఖ్య నాయకులతో కె.కె రాజు కృతజ్ఞతా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కె కె రాజు మాట్లాడుతూ నేను సమన్వయ కర్తగా బాధ్యతలు తీసుకున్న నాటినుండి ఇటీవలే జరిగిన ఎన్నికల వరకు పార్టీ కోసం పనిచేసిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞత తెలిపారు. ఇంకా పలువురు నాయకులు మాట్లాడుతూ కె కె రాజు అందరినీ సమన్వయం చేసుకోవడంలో సఫలం కావడంతో ఈ రోజు పార్టీ విజయం దిశగా కనిపిస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో వంశీక ృష్ణ శ్రీనివాస్, సత్తి రామక ృష్ణ రెడ్డి, రొంగలి జగన్నాధం, చంద్ర మౌళి, కొయ్యప్రసాద్ రెడ్డి, పక్కి దివాకర్, చొక్కాకుల వెంకట్రావు, పీల వెంకట లక్ష్మీ, బాణాల శ్రీనివాసరావు, పోతు సత్యనారాయణ, సేనాపతి అప్పారావుతో పాటు నియోజకవర్గంలో నాయకులు పాల్గొన్నారు.

**ప్రపంచకప్ జట్టుపై స్పందించిన రాయుడు**

న్యూఢిల్లీ : బీసీసీఐ సోమవారం ప్రకటించిన ప్రపంచకప్ జట్టులో అంబటి రాయుడుకు చోటు దక్కని సంగతి తెలిసిందే. రాయుడు విషయంలో అందరూ అయ్యో పాపం రాయుడూ అంటూ సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. కానీ, రాయుడు మాత్రం భిన్నంగా స్పందించాడు. సేవలు అందిస్తాడని అందుకే విజయ్‌ను ఎంపిక చేశామని అన్నాడు.



మంగళవారం పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ పండగ సందర్భంగా పోలమాంబ తల్లిని దర్శించుకున్న తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అక్కరమాని విజయనిర్మల వెంకట్రావు దంపతులు. వారితో వార్డు అధ్యక్షుడు నీలరెడ్డి, వార్డు ముఖ్య నాయకులు, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెల్లూరు లోక్‌సభ పోలింగ్ రద్దు

న్యూదిల్లీ: తమిళనాడులోని వెల్లూరు లోక్‌సభ ఎన్నికను కేంద్ర ఎన్నికల సంఘం రద్దు చేసింది. ఆ నియోజక వర్గంలో ఇటీవల భారీగా నగదు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడ పోలింగ్‌ను రద్దు చేయాలని సిఫార్సు చేస్తూ ఏప్రిల్ 14న ఈసీ.. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు ప్రతిపాదనలు పంపింది. ఇందుకు మంగళవారం.. రాష్ట్రపతి అంగీకరించడంతో అక్కడ ఎన్నిక రద్దయింది. కాగా, ఇటీవల వెల్లూరులో ఈసీ, ఐటీ నిర్వహించిన తనిఖీల్లో స్థానిక డీఎంకే పార్టీ కార్యాలయంలో భారీగా నగదు పట్టుబడింది.

వెల్లూరు డీఎంకే అభ్యర్థి కదిర్ ఆనంద్ వద్ద దాదాపు రూ.11కోట్లు అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. అంతేగాకుండా, ఆనంద్ ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చిన నేరం కింద కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్లు కూడా ఇటీవల ప్రచారం జరిగింది. కాగా, తమిళనాడులోని 39 స్థానాల్లో ఏప్రిల్ 18న ఎన్నికలు జరగాల్సి ఉంది. వెల్లూరు ఎన్నిక రద్దుతో 38 స్థానాల్లో పోలింగ్ జరగనుంది.

# నయనానందభరితంగా అప్పన్న కళ్యాణోత్సవం

**- శోభాయమానంగా రథోత్సవం - అప్పన్న నామస్మరణతో మారుమ్రోగిన సింహగిరి**









సింహాచలం : సింహగిరివాసుడు ,ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు శ్రీ సింహాద్రి అప్పన్న కళ్యాణోత్సవం మరియు రధోత్సవం అశేష భక్తజన సందోహం మధ్య నయనానంద భరితంగా, ఘనంగా జరిగింది. వార్షిక కళ్యాణం పురష్కరించుకొని ముందుగా స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన ,విశేష హెూమం ,బాలభోగము ,గ్రామ బలిహరణం, మంగళశాసనములు ఇత్యాది కార్యక్రమాలు అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం సాయంత్రం కట్నాల ఉత్సవం ,ఎదురు సన్నాహ ఉత్సవములు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను పెళ్లి అలంకరణలో ముస్తాబుచేసి రథంపై ఆసీనులు గావించగా ఉభయ దేవేరులతో స్వామివారు భక్తులను అశీర్వదించగా స్వామివారిని ఆలయ అనువంశిక ధర్మకర్త అశోకగజపతిరాజు కుటుంబం స్వామివారిని దర్శించుకోగా రధసారధి కదిరి లక్ష్మణ్ రావు జై గంట మ్రోగించి రధయాత్రను ప్రారంభించారు. స్వామివారి రథంతో పాటుగా అశేషభక్తజనం అప్పన్న నామస్మరణతో మారుమోగిపోగా భక్తుల కోలాటం ,కర్రసాములు, కేరళా సంప్రదాయ వాయిద్యాలు ,నాట్య కళాకారుల వివిధ నృత్యాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అంగరంగవైభవంగా స్వామివారి రథాయాత్ర జరిగింది.

అనంతరం న ృసింహ మండపంలో రంగు రంగుల పులతో ,రంగురంగుల విధ్యుత్ దీపాలతో భారీగా తయారు చేసిన కళ్యాణ మండపంలో స్వామి అమ్మవార్లను కూర్చుండపెట్టి భారీ భక్తజన సందోహం మధ్య ముహూర్త సమయానికి స్వామివారు అమ్మవార్ల నుదిటిపై జిలకర్ర బెల్లంపెట్టగా స్వామివారు ముహూర్త సమయానికి మాంగల్యధారణ చేసారు. అనంతరం స్వామి అమ్మవర్లు పులమాలలు మార్చుకోగా అనంతరం ముత్యాల తలంబ్రాలు స్వామి అమ్మవార్ల ఒకరిపైనొకరు వేసుకుంటుండగా ఆ సుంధర ఘట్టాన్ని చూసిన భక్తజనం మురిసిపోయి కన్నులవైభవంగా వీక్షించారు.

కళ్యాణం పురష్కరించుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా దేవస్థానం వారు ఏర్పాట్లు చేశారు. భక్తులకు నీరు, అన్నప్రసాదం మరియు అర్ధరాత్రివరకు బస్సులు ఏర్పాటు చేశారు.

# కోడెల సహా 22 మందిపై కేసు నమోదు



గుంటూరు: ఏపీ శాసనసభ స్పీకర్, సత్తెనపల్లి తెదేపా అభ్యర్థి కోడెల శివప్రసాదరావుపై గుంటూరు జిల్లా రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

ఎన్నికల రోజున సత్తెనపల్లి నియోజకవర్గం ఇనిమెట్ల పోలింగ్ కేంద్రంలో కోడెల ఆక్రమణకు పాల్పడ్డారంటూ వైకాపా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో కోడెలతో పాటు మరో 22 మంది తెదేపా నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు.








Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com